నేడు TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY



## మధ్యలో జోక్యం చేసుకోవద్దు
అమెరికాకు చైనా వార్నింగ్ 08

బుధవారం | 15.04.2026 | సంపుటి : 3 | సంచిక :354 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com

# వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు

**చట్టసభల్లో వారి ఉనికి చాటేందుకు అవకాశం**

**దేశ మహిళలకు లేఖలో ప్రధాని మోడీ వెల్లడి**



**రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలవుతాయని, దీంతో మన రాజ్యాంగం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ మేరకు ఆయన దేశ మహిళలకు ఓ లేఖ రాసి దాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ప్రస్తుతం పలు రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారు. అదేవిధంగా చట్ట సభల్లోనూ వారి ఉనికిని చాటేందుకే ఈ రిజర్వేషన్ల పక్రియ మొదలుపెట్టాం.**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 : పార్లమెంట్‌లో ఏప్రిల్ 16 నుంచి జరగనున్న మూడు రోజుల సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' బిల్లులో సవరణలు ప్రవేశపె డతాం. దీనిపై ఏమాత్రం ఆల స్యం జరిగినా అది భారతదేశ మహిళలకు అన్యాయం చేసిన ట్టే. 2029 లోక్‌సభ ఎన్నికల సమయానికి -మిగతా 2 లో..



## ప్రధాని మోడీతో ట్రంప్ ఫోన్ సంభాషణ

**పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రరూపం దాల్చిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. దాదాపు 40 నిమిషాల పాటు వీరు సంభాషించినట్లు సమాచారం. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక సహకారం, హర్మూజ్ జలసంధిని తెరవడంపై ప్రధానంగా చర్చించినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అమెరికా-ఇరాన్‌ల మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అగ్రనేతల సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది. మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయ పురోగతిని సమీక్షించాం. అన్ని రంగాల్లో సమగ్ర అంతర్జాతీయ -మిగతా 2 లో..

## మహిళా బిల్లుతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

**మహిళా బిల్లులను తక్షణమే అమలు చేయాలి**

**డీ లిమిటేషన్‌పై విస్తృత చర్చ జరపాలి**

**ప్రధాని మోడీకి సిఎం రేవంత్ బహిరంగ లేఖ**



హైదరాబాద్,ఏప్రిల్14 : మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాశారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ -మిగతా 2 లో..



## బలమైన దేశంగా ఎదగడానికి అంబేద్కర్‌కృషి

**దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లు**

**తెలంగాణలో దళితులు అభ్యున్నతికి పెద్దపీట**

**దళితబిడ్డలు ఉన్నత పదవుల్లో ఉంటే ఓర్వలేకపోతున్నారు**

**ప్రస్తుత డీలిమిటేషన్‌తో తెలంగాణకు తీరని అన్యాయం**

**అంబేద్కర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి**

దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేడ్కర్ పాత్ర అంతే ఉందన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 02



## కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

**పదేళ్ల దుర్మార్గ పాలనలో లక్షల దోపిడీ**

**కెటిఆర్ పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరు**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజం**

ఖమ్మం, ఏప్రిల్ 14 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దుర్మార్గమైన పరిపాలన చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటున్నారని.. ఆయన పాదయాత్ర కాదని.. ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ని క్షమించరని హెచ్చరించారు. కేసీఆర్.. అప్పులు చేసి ఫాంహౌస్‌లో పడుకున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ పాదయాత్రకు ముందు మీ చెల్లి కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఈ మేరకు మాజీ మంత్రి కేటీఆర్‌పై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల -మిగతా 2 లో..

## రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలి



**ప్రజలను బంట్రోతుగా చూస్తున్నారా?**

**ఇందిర,రాహుల్, ప్రియాంక ఎక్కడ పోయారు**

**ఉత్తరాది, దక్షిణాది అంటూ విభేదాలు సృష్టిస్తారా**

**రేవంత్ వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి**

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహించారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తప్పడు మాటలు మాట్లాడొద్దని, వాస్తవాలు మాట్లాడాలని సూచించారు.**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 : రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలని కిషన్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ వ్యతిరేకంగా పుట్టిన పార్టీ టీడీపీ అని తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవంగా -మిగతా 2 లో..



**అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం**

## ఏర్పాటు ఘనత కేసీఆర్‌దే..

**అంబేద్కర్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, ఏప్రిల్ 14 :** బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాడితే పోయేదేమీ లేదన్న శ్రీశ్రీ చెప్పిన మాట నిజం అయిందని.. ప్రపంచంలోనే -మిగతా 4 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹70



## అజ్ఞాతంలో కేవలం నలుగురు మావోయిస్టులు

**గణపతి, సంతోష్,రత్నాబాయి, వార్త శేఖర్**

**తెలంగాణ పోలీస్ శాఖ వెల్లడి**

హైదరాబాద్,ఏప్రిల్14 : తెలంగాణాకి చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని -మిగతా 2 లో..

## 42 డిగ్రీలకు ఎండ

**తెలంగాణ రాష్ట్రంలో మండుతున్న ఎండలు**

హైదరాబాద్,ఏప్రిల్14 : తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. దాంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. రాష్ట్రంలో వివిధ చోట్ల 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు మండుతుండటంతో ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్‌తోపాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్ -మిగతా 2 లో..



## జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌కు చెక్

**ఇకనుంచి భారీగా జరిమానా విధింపు**

**నేటి నుంచే అమల్లోకి వచ్చిన నిబంధన**

న్యూఢిల్లీ,ఏప్రిల్ 14 : జాతీయ రహదారులపై ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు విధించే జరిమానాలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సవరించింది. కొత్త నిబంధనలు -మిగతా 2 లో..



## వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో

# మహిళా రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

మహిళల రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని అంటూ దేశ మహిళలకు రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. భారతదేశ కుమార్తెలు వారి హక్కుల కోసం జీవితాంతం వేచి చూడటం సబబు కాదు. చట్టసభల్లో వారి గొంతుకను గట్టిగా వినిపించే సమయం వచ్చింది. దీంతో ప్రజాస్వామ్యం కూడా దృఢంగా మారనుంది. జరగబోయే పార్లమెంట్ సమావేశానికి, రాజ్యాంగ సవరణ ఆమోదం కోసం, దేశం నలుమూలలా ఉన్న కోట్లాది మంది మహిళల ఆశీస్సులు కోరుకుంటున్నాను. మీరంతా మీ స్థానిక ఎంపీలకు లేఖ రాసి పార్లమెంట్ సభల్లో పాల్గొనాలని వారిని కోరండి' అని మోదీ ఆ లేఖలో రాసుకొచ్చారు. 2023 పార్లమెంటు సమావేశాల్లో నారీ శక్తి వందనం అధినియమ్' రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్లకు సంబంధించిన ఈ బిల్లులో సవరణలు జరుగుతున్నాయి. లోక్‌సభలో 1/3 వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని నిర్ణయించారు. అంటే మొత్తం 816 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు దాదాపు 273 సీట్లను కేటాయించేలా చట్టంలో సవరణలు చేయనున్నారు.



# పదేళ్ల దుర్మార్గ పాలనలో లక్షల దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ హయాంలో ఏం చేశారని.. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క లెక్కలతో సమాధానాలు అడుగుతుంటే కేసీఆర్ అండ్ కో సతమతమవు తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత సంతోశ్‌రావు ఎలా సంతోషంగా ఉన్నారో.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆనందం ఏంటో మీ దోపిడీ ఎంతో.. మీ చెల్లెలు కవిత చెబుతోందని సెటైర్లు గుప్పించారు. పదేళ్లు దోపిడీకి అలవాటు పడి నేడు పదవులు కోల్పోయి ప్రజల ఆగ్రహానికి గురై నేడు విలవిలలాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ అండ్ కో పిచ్చిమాటలు మాట్లాడుతూ అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా ఈ దేశంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లా.. కాంగ్రెస్‌కి ఎప్పుడూ అండగా నిలిచిందని ఉద్ఘాటించారు. బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న పీవీ నరసింహ రావు దేశ ప్రధాని అయ్యారని ప్రస్తావించారు. ఇది ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలని మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతో నేడు తెలంగాణలో అధికారంలోకి వచ్చామని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా వారికి నచ్చినట్లుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే.. కాంగ్రెస్ అడ్డుకుందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాట ఫలితంగా కులగణన చేశారని ప్రస్తావించారు. కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తలు కీలక పదవులు పొందారని అన్నారు. భట్టివిక్రమార్క చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఉద్ఘాటించారు. ఖమ్మం గడ్డపై నిలబడి చెబుతున్నా.. వచ్చే ఎన్నిక కాదని.. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. చేతనైతే తమ విజయాన్ని అడ్డుకోవాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తాము నెరవేరుస్తున్నామని తెలిపారు. ఖమ్మం నుంచే కాంగ్రెస్ విజయం ప్రారంభమైందని చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



## అజ్ఞాతంలో కేవలం

# నలుగురు మావోయిస్టులు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ఉన్నారని పోలీస్ శాఖ వివరించింది. సాయుధ పోరాటం విరమించి.. జనజీవన స్రవంతిలో కలవాలంటూ ఇప్పటికే మావోయిస్టులకు డీజీపీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణా ప్రభుత్వ లొంగుబాటుతోపాటు పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలను మావోయిస్టులకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. మరోవైపు సోమవారం కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎల్‌ఓసీ కమాండర్ రూపీ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఆమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఆమె అజ్ఞాతంలో ఉంటున్నారు. మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా రూపీ రెడ్డి ఉన్నారు. ఆమెపై రూ. 5 లక్షల రివార్డు ఉంది. ఆమె మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఈ మృతదేహం ఆమె స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లు

**హైదరాబాద్,ఏప్రిల్14:** అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆ ఇదకదరు మహానుభావులు దేశానికి రెండు కళ్లలాంటి వారని అన్నారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు. బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేద్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే చూడలేకపోతున్నారంటూ విమర్శించారు. గతంలో భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత హోదాను తొలగించేలా కుట్రలు జరిగాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎనాడైనా డైట్ ఛార్జీలు పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఓర్వలేక పోతున్నారంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక 67వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 67వేల ఉద్యోగాల్లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే వచ్చాయని వెల్లడించారు. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు చేసిన అప్పులు చెల్లిస్తూ.. తప్పులు సరిదిద్దుతూ పాలన కొనసాగిస్తున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 50 శాతం జనాభా ఆధారంగా.. మరో 50 శాతం జీఎస్‌డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్‌లో డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్



హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించిందని.. కానీ లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేద్కర్ మార్గదర్శనం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయి. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారు. తెలంగాణకు తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తాం అని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# మహిళా బిల్లుతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

(మొదటిపేజీ తరువాయి)

తర్వాతే డీలిమిటేషన్ చేయాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతిస్తుంది. తక్షణమే ఈ రిజర్వేషన్లు అమలు చేయాలి. పెంచాలనుకుంటున్న 272 లోక్‌సభ సీట్లలో 50 శాతం అంటే..136 ప్రొరేటా(జనాభా ప్రాతిపదికన), మిగిలిన 50శాతం (136 సీట్లు) రాష్ట్రాల స్థూల ఆర్థికవృద్ధి రేటు ఆధారంగా పునర్విభజన చేయాలని రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఆలస్యం చేయకూడదని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ తన లేఖలో మహిళా రిజర్వేషన్లకు దేశవ్యాప్తంగా విస్తృత మద్దతు ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా అసెంబ్లీ స్థానాల్లో మహిళా కోటాను తక్షణమే అమలు చేస్తే, దేశమంతా స్వాగతిస్తుందని తెలిపారు. ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆందోళనలు వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేపడితే.. దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకా




శం ఉందన్నారు. ఈ పక్రియ తాత్కాలికంగా కొన్ని రాజకీయ పార్టీలకు, ముఖ్యంగా బీజేపీకి లాభం చేకూర్చవచ్చని.. కానీ దీర్ఘకాలంలో దేశానికి నష్టం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. పార్టీ ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. లోక్‌సభ డీలిమిటేషన్ విషయంలో కేవలం జనాభా నిష్పత్తి ఆధారిత విధానాన్ని కాకుండా.. ఇతర ప్రత్యామ్నాయ నమూనాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను గౌరవిస్తూ జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం సాధించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ తన లేఖలో పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమగ్ర చర్చలు జరిపి నిర్ణయం తీసుకోవాలని ప్రధాని మోడీని కోరారు.

# తెలంగాణలో మండుతున్న ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో.. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొన్నది. గురువారం నుంచి ఎండలు మరింత ఠారెత్తించే అవకాశమున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3 గంటలవరకు బయటకు రావద్దని సూచించింది.



## మహిళా పోలీసులు పెరిగాక శాఖ

# పనితీరులోనూ మార్పు: డీజీపీ

**నిర్మల్ :** "ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పోలీసుశాఖలో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించి అమలు చేస్తున్నారు. సివిల్ విభాగంలో 30 శాతం, ఏఆర్‌లో 20 శాతం చొప్పున వారే ఉండేలా చర్యలు చేపట్టాం. ఉద్యోగినులు పెరిగాక శాఖ పనితీరులోనూ మార్పు సుస్పష్టమైంద"ని డీజీపీ బి.శివధర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలోని బ్రీఫింగ్‌హాల్‌లో 'పోలీసు అక్క'లతో మాటామంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో పలు కీలక విభాగాల్లో మహిళలు అధికారులుగా రాణిస్తున్నారని చెప్పారు. అతివలకు అవకాశం కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయనేందుకు ఇది నిదర్శనమన్నారు. మహిళల్లోనూ ఆత్మస్థైర్యం పెరుగుతోందని, సమాజాన్ని చూసే కోణం మారుతోందని తెలిపారు. నిర్మల్ జిల్లాలో ప్రారంభించిన 'పోలీసు అక్క' కార్యక్రమానికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం అభినందనీయమని, ఇది రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని డీజీపీ చెప్పారు. పోలీసు అక్క, నారీశక్తి, సివంగి.. ఇలా మహిళలే కేంద్రంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసించారు. ప్రజలు, విద్యార్థులతో మమేకమవుతూ వారిలో ధైర్యం, భరోసా పెంపొందించేలా సమర్థంగా పనిచేయాలని సూచించారు. వీటి అమలుతీరుపై




మహిళా ఉద్యోగుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని డీజీపీ ప్రారంభించి, ఆవరణలో మొక్క నాటారు. పోక్సో కేసుల బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ విభేదాలతో విడిపోయి, భరోసా చొరవతో మళ్లీ ఏకమైన జంటలకు ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు. ఎస్పీ జానకిషర్మిల, నిర్మల్, భైంసా సహాయ ఎస్పీలు సాయికిరణ్, రాజేశ్‌మీనా తదితరులు పాల్గొన్నారు. సోన్ మండల కేంద్రంలో 'అరైవ్- అలైవ్' కార్యక్రమంలోనూ డీజీపీ పాల్గొన్నారు.

## పశ్చిమాసియాలో

# ఉద్రిక్త పరిస్థితులు

(మొదటిపేజీ తరువాయి)

వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలో పరిస్థితులపైనా చర్చించాం. హర్మూజ్‌ను తెరవడం, సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోదీ పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. ఇద్దరి నేతల మధ్య సంభాషణ సానుకూలంగా సాగిందన్నారు. పశ్చిమాసియా లో నెలకొన్న పరిణామాలను ప్రధాని మోదీకి ట్రంప్ వివరించారని తెలిపారు.



## ప్రజలను బంట్రోతులుగా

# చూస్తున్నారా?

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉపరాష్ట్రపతులుగా ఉన్నారని ప్రస్తావించారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పని చేశారని, తాను ఒక్కడినే మేధావిని అనుకుని అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని ప్రశ్నించారు. లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ రెడ్డి అంటున్నారని.. మరి ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారని కిషన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ బుద్ధితో నడిపిస్తే, రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కి అధికారికంగా కోశాధికారిగా పని చేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. డీలిమిటేషన్‌తో ఎన్ని సీట్లు పెరుగుతాయనేది పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తోందని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్, జీడీపీ పరంగా సీట్లు పెరగాలని అంటున్నారని, ప్రపంచలో ఇది ఎక్కడ లేదని అన్నారు. అలాంటప్పుడు అసెంబ్లీ సీట్లు ఆదిలాబాద్, ఖమ్మంలో తగ్గిస్తారా.. అని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్‌లో మాత్రమే సీట్లు పెంచుతారా..అనేది రేవంత్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. 70 శాతం రెవెన్యూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే వస్తోందని తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ తర్వాత అంతటి మేధావి రేవంత్ రెడ్డినేనని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## జాతీయ రహదారులపై

# ఓవర్‌లోడ్‌కు చెక్

(మొదటిపేజీ తరువాయి)

ఏప్రిల్ 15 నుంచి అంటే నేటినుంచే అమల్లోకి వస్తాయి. దీని ప్రకారం.. వాహనానికి అనుమతించిన బరువు కంటే అదనంగా ఉన్న భారాన్ని బట్టి జరిమానా వసూలు చేస్తారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ ఫీ ఫోర్త్ అమెండ్‌మెంట్ రూల్స్, 2026ని మోర్త్ నోట్ఫి÷ చేసింది. 10 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు ఎటువంటి జరిమానా విధించరు. 10 నుంచి 40 శాతం వరకు ఓవర్‌లోడ్‌కు సాధారణ టోల్ రుసుము కంటే 2 రెట్లు అధికంగా రుసుము వసూలు చేస్తారు. 40 శాతం కంటే ఎక్కువ ఓవర్‌లోడ్‌తో వెళితే సాధారణ టోల్ రుసుము కంటే 4 రెట్లు అధికంగా విధిస్తారు. ఓవర్‌లోడ్‌కు విధించే జరిమానాను ఫాస్టాగ్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ఎ÷-లాజా వద్ద బరువు కొలిచే ఏర్పాటు లేకపోతే ఎలాంటి రుసుములూ ఉండవు. రహదారుల భద్రతను పెంపొందించడం, రహదారి మౌలిక సదుపాయాలను రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

# దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీ కాంగ్రెస్

- రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వం
- రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు
- విపక్షాల తీరుపై మండిపడ్డ భట్టి విక్రమార్క



**ఖమ్మం, ఏప్రిల్ 14 :** దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అలాగే, అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా కాంగ్రెస్ కార్యాయలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. నేడు దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోంటే రైతులకు ఆ మేలు జరగకూడదని ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహించారు. పేదలకు ఇళ్లు దక్కకూడదనే లక్ష్యంతో ప్రతిపక్షాల నేతలు దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బలోపేతానికి అందరం ఐక్యంగా కృషిచేద్దామని భట్టి విక్రమార్క సూచించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడారని ప్రశంసించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేద్దామని సూచించారు. పార్టీకోసం కష్టపడిన వాళ్లకి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## వచ్చే ఏడాది హరిద్వార్‌లో కుంభమేళా

### వెల్లడించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 :** వచ్చే ఏడాది ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో కుంభమేళా నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. కుంభమేళా నిర్వహణకు వీలుగా 'దేవభూమి'ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని.. పుణ్యస్థలాల్లో ప్రజలు కూడా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు ప్రతిబింబించేలా కుంభమేళాను పరిశుభ్రంగా, వైభవంగా జరుపుకొందామన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు ఆసక్తిగా ఎదురు చూసే మినీ చార్‌ధామ్ యాత్ర కూడా మరికొన్ని నెలల్లో ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో భక్తుల రాకతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన 213 కిలోమీటర్ల హైస్పీడ్, యాక్సెస్-కంట్రోల్డ్ హైవే ఢిల్లీ- డెహ్రాడూన్ మధ్య ప్రయాణ సమయాన్ని ఆరు గంటల నుంచి రెండున్నర గంటలకు తగ్గిస్తుందన్నారు. కొత్త ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంత ఆర్థిక స్వరూపం పూర్తిగా మారిపోతుందని.. రోడ్లు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వేలు, విమాన, జలమార్గాలు కలిసి దేశ భవిష్యత్ మార్గాన్ని నిర్దేశిస్తాయన్నారు.

## విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలు

### ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 14 :** విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలు చేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా విదేశీ ఉద్యోగాల ప్రచారం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. ఎటువంటి అనుమతులు లేకుండా ఓవర్సీస్ కన్‌స్టలెన్సీలను నడుపుతూ గ్రీస్, రుమేనియా దేశాల్లో ఉద్యోగాల పేరుతో లక్షలు దండుకుంటున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ట్రివియల్ చాప్టర్ సంస్థకు చెందిన నిరుపమ, అరుణ్ రాజ్ లను జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రీస్, రొమేనియా ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి రూ.50 వేల నుంచి రూ4 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. బాధితులను నమ్మించేందుకు నకిలీ వర్క్ ఆథరైజేషన్ లెటర్ ఇస్తూ మోసం చేస్తున్నారు. లైసెన్స్ లేకుండానే ఓవర్సీస్ కన్‌స్టలెన్సీ నడుపుతున్న ఈ ముఠా.. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా విదేశీ ఉద్యోగాల ప్రచారం చేస్తూ నిరుద్యోగులను ఆకర్షిస్తున్నారు. ఈ కేసులో మరో 8మంది నిందితులకోసం గాలింపు చర్యలు చేపట్టారు పోలీసులు. ఇప్పటికే కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఈ ముఠాపై పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. విదేశాల్లో ఉద్యోగ ఆఫర్లు నకిలీవో, ఒరిజినల్ వో పోర్టల్‌లో ఏజెంట్ల వివరాలు చెక్ చేసుకోవాలని నిరుద్యోగులకు పోలీసులు సూచిస్తున్నారు.

## గ్రానైట్ దందాపై కొరడా

### రవాణా చేస్తున్న పలు వాహనాలు సీజ్

**కరీంనగర్, ఏప్రిల్ 14 :** కరీంనగర్ జిల్లాలో అక్రమ మైనింగ్‌పై పోలీసులు కొరడా ఝులిపించారు. అక్రమంగా గ్రానైట్ రవాణ చేస్తున్న పలు వాహనాలను సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ బ్లాక్ దందా చేస్తున్నట్లు గుర్తించారు. అక్రమ గ్రానైట్ రవాణాపై మైనింగ్ శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వస్తున్న ఆరోపణల క్రమంలో తనిఖీలు చేపట్టారు పోలీసులు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రానైట్ తరలిస్తున్న లారీలను ఆపి చెక్ చేశారు పోలీసులు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ బ్లాక్ దందా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. వారంరోజుల్లో 20 వాహనాలను సీజ్ చేశారు. వాహనాల ఓవర్ లోడ్, అనుమతులు లేకుండా రవాణా, జీఎస్టీ చెల్లించని స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు సీజ్ చేయడంతో పోలీస్ స్టేషన్ కు క్యూకట్టారు గ్రానైన్ వ్యాపారులు. అక్రమంగా జరుగుతున్న గ్రానైట్ రవాణాపై మైనింగ శాఖ చూసి చూడనట్టు వ్యవహరిస్తోందని ఆరోపణలు వస్తున్న క్రమంలో కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. విదేశాలకు ఎగుమతి చేస్తున్న గ్రానైట్ పై నిఘా పెట్టారు.

## ఉస్మానియాలో అక్రమాలు

### విచారణ జరపాలన్న ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్, ఏప్రిల్ 14 :** ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య మంత్రికి లేఖ రాశానని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. చెన్నైకు చెందిన ప్రైవేట్ సంస్థకు ఆసుపత్రిలో శుభ్రత బాధ్యత అప్పగించారని వివరించారు. అధికారిక రికార్డుల ప్రకారం, ప్రభుత్వం ప్రతి నెలా సుమారు 787 మంది కార్మికులకు చెల్లింపులు చేస్తోందని, వాస్తవంగా విధుల్లో ఉన్న కార్మికులు 400 మందేనని ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ప్రతి కార్మికుడికీ నెలకు సుమారు 11,400 చెల్లిస్తున్నారని, వాస్తవంగా పనిచేసే కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటంతో, ప్రతి నెల లక్షల రూపాయలు దుర్వినియోగం అవుతున్న అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాలు మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని విమర్శించారు.

## బీహార్ సిఎం పదవికి నితీశ్ రాజీనామా

- కొత్త సిఎంగా బిజెపికి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక
- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్



**పాట్నా, ఏప్రిల్ 14 :** బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

## ఎయిర్‌పోర్టుల నిర్మాణంలో తెలంగాణకు అన్యాయం

- పలుమార్లు కోరినా పట్టించుకోని కేంద్రప్రభుత్వం
- పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ



**పెద్దపల్లి, ఏప్రిల్ 14 :** తెలంగాణకు కేంద్రం ఎలాంటి నిధులు మంజూరు చేయాడంలేదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. కొత్త విమానాశ్రయాల గురించి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని.. ఈ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 9 విమానాశ్రయాలు ఉండగా తెలంగాణకు కేవలం ఒకటే విమానాశ్రయం ఉందని.. అయినా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంగళవారం మంథని పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి, శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి తెలంగాణకు ఎన్ని నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావలసిన నిధుల పట్ల కేంద్ర మంత్రులు ప్రశ్నించడం లేదన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రులు అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించాలని పార్లమెంట్‌లో మాట్లాడుతున్నారే తప్ప తెలంగాణ గురించి మాట్లాడడం లేదని ఆరోపించారు. రామగుండంలో సింగరేణి కార్మికుల కోసం ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. దీనిపై పార్లమెంట్లో గళం విప్పుతామని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్లు పెంచడం కొరకు పోరాటం చేస్తామని తెలిపారు. కొన్ని రోజులుగా విద్యుత్ కార్మికులు చేస్తున్న సమ్మె గురించి సీఎం రేవంత్ కి వివరించి.. వారి సమస్యలు నెరవేరే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

**యాదాద్రి, ఏప్రిల్ 14 :** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని గౌస్ కొండ గ్రామ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సరదాగా షికారుకు వెళ్లిన యువకుల బృందంలో ఒకరు నీటిలో మునిగి గల్లంతయ్యారు. స్థానిక సమాచారం ప్రకారం.. ఆరుగురు యువకులు కలిసి గౌస్ కొండ గ్రామ సమీపంలోని చెరువు సమీపంలో సరదాగా గడపాలని నిర్ణయించుకున్నారు. ఒక బుట్ట పడవ సహాయంతో నీటిలోకి షికారుకు వెళ్లారు. అయితే, నీటి మధ్యలోకి వెళ్లిన తర్వాత ఊహించని విధంగా పడవ బోల్తా పడింది. పడవ బోల్తా పడటంతో అందులోని ఆరుగురు యువకులు నీటిలో పడిపోయారు. వారిలో ఐదుగురు యువకులు ఈత కొట్టుకుంటూ క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. అయితే, పాండాల శివకుమార్ గౌడ్ అనే యువకుడు మాత్రం నీటి ఉధృతికి లేదా లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక గల్లంతయ్యాడు. విషయం తెలిసిన వెంటనే స్థానికులు, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన శివకుమార్ గౌడ్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో గౌస్ కొండ గ్రామంలో, యువకుడి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సరదాగా వెళ్లిన విహారయాత్ర ఇలా ప్రాణాల మీదకు తీసుకురావడంతో తోటి మిత్రులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

## పంటపొలంలో అగ్నిప్రమాదం

### పదెకరాల మొక్కజొన్న పంట దగ్ధం

**నంద్యాల, ఏప్రిల్ 14 :** నంద్యాల జిల్లా పాములపాడు మండలంలో విషాదం చోటుచేసుకుంది. కంబాలపల్లె గ్రామ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు పదెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట పూర్తిగా కాలి బూడిదైంది. చేతికి వచ్చిన పంట కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానికులు, అధికారుల సమాచారం ప్రకారం.. పొలంలో మొక్కజొన్న కోత పూర్తయిన తర్వాత కింద రాలిపోయిన కంకులను ఏరుకునేందుకు చంద్రకళ అనే మహిళ ప్రయత్నించింది. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న చొప్పను తొలగించడానికి ఆమె నిప్పంటించింది. అయితే, గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలు ఒక్కసారిగా అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాలకు వేగంగా విస్తరించాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న మరిన్ని పొలాలకు మంటలు వ్యాపించకుండా నివారించగలిగారు. అప్పులు చేసి సాగు చేసిన పంట కాలిపోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో నష్టపోయిన తమను ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని, పరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేశారు. వేసవి కాలం, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో పొలాల్లో చెత్తను కాల్చడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. చిన్న అజాగ్రత్త పెద్ద ఆస్తి నష్టానికి దారితీస్తుందని ఈ ఘటన మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ సీరియస్

### ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 14 :** నాగర్ కర్నూల్ జిల్లాలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సస్పెండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు, ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ మార్గదర్శకాలను పాటించకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ, విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యం ప్రదర్శించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వంగూరు మండలం పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎ పంచాయతీ కార్యదర్శి పి.కిషన్, కొల్లాపూర్ మండలం పరిధిలోని సింగోటం గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎఎ పంచాయతీ కార్యదర్శి అర్జునయ్య, అలాగే కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామపంచాయతీకి చెందిన గ్రేడ్-ఎఎ పంచాయతీ కార్యదర్శి ప్రేమచంద్‌లను విధుల నుండి సస్పెండ్ సస్పెండ్ చేశారు. అదేవిధంగా పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా వంగూరు, కొల్లాపూర్ మండలాల పంచాయతీ అధికారులకు షోకాస్ నోటిసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఓఆర్ఆర్‌పై ప్రమాదం : ఇద్దరు మృతి

**హైదరాబాద్,ఏప్రిల్14 :** రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట వద్ద ఔటర్ రింగ్‌రోడ్డు పై ప్రమాదం జరిగింది. మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

## శ్రీశైలంలో భారీగా మద్యం పట్టివేత

### ఐదుగురు మహిళల అరెస్ట్

**నంద్యాల, ఏప్రిల్ 14 :** శ్రీశైలంలో ఐదుగురు మహిళల వద్ద భారీగా మద్యం పట్టుబడింది. మద్య సీసాలను పోలీసులు సీజ్ చేసి ముద్దాయిలను అరెస్టు చేశారు. శ్రీశైల పుణ్యక్షేత్రంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆత్మకూరు డిఎస్పీ ఉత్తర్వుల మేరకు శ్రీశైలం సిఐ గంగనాథ్ బాబు ఆధ్వర్యంలో ఎస్సై సుబ్బారెడ్డి, సిబ్బంది కలిసి శ్రీశైలం పరిసర ప్రాంతాలైన రామయ్య టర్నింగ్, టోల్గేట్, టూరిస్ట్ బస్టాండ్లో ఐదుగురు మహిళల ముద్దాయిల వద్ద ఉన్న 24 లీటర్ల సారాయి, 314 డీపీఎల్ 180 ఎం.ఎల్ బాటిల్స్ ను సీజ్ చేసి ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారిని ఆత్మకూరు కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా శ్రీశైలం సీఐ గంగనాద బాబు మాట్లాడుతూ . శ్రీశైలం పవిత్ర క్షేత్రంలో దేవాదాయ చట్టానికి విరుద్ధంగా అమ్మడం నిషేధం అన్నారు. శ్రీశైలంలో మాంసము, బీడీ, సిగరెట్లు అమ్మిన ఎంతటి వారిపైనా అయిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుణ్యక్షేత్రంలో ఇలాంటి నిషిద్ధ మైన వాటిపై చాలా కఠినంగా వ్యవహరిస్తామని, అవసరమైతే పీడి యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామన్నారు. పట్టుబడినవారు ఆత్మకూరు నుండి మద్యం తెచ్చుకొని శ్రీశైలంలో అమ్ముతున్నట్లు తెలిపారు. ఆత్మకూరు నుండి (4) ఆదిలక్ష్మి, అశ్విని, హేమలత, మంగమ్మ, సుశీలమ్మ దోర్నాల నుండి ఒక మహిళ ఉన్నారని తెలిపారు.

## నేడు ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

**అమరావతి, ఏప్రిల్ 14 :** ఏపీలో ఇంటర్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను బుధవారం ఉదయం 10.31గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఫలితాలను వెబ్‌సైట్లలోనూ పొందొచ్చు. అలాగే, మనమిత్ర ద్వారా వాట్సప్‌లోనూ (9552300009) ఈ ఫలితాలు పొందొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఏపీలో ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి 23 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైనప్పటికీ అనుకున్న సమయానికన్నా ముందే ఫలితాలను విడుదలకు సిద్ధం చేయడం విశేషం. ఏపీ ఇంటర్ ఫలితాలతో పాటు దీనికి సంబంధించిన అప్‌డేట్స్‌ను వెబ్‌సైట్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

## 16న మహిళా బిల్లు, డి లిమిటేషన్‌పై చర్చ

### బిల్లుపై ఎంపిలకు సమాచారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 :** దేశంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న వీటిని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారమిస్తూ.. సంబంధిత ప్రతులను వారికి పంపింది. నూతన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెరగనుండగా, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలకు పెరిగే అవకాశముంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని సమాచారం. లోక్‌సభలో దీనికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందాక కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి, సీట్ల పెంపు ప్రక్రియను పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలుచేసే దిశగా భావిస్తున్నట్టు తెలుస్తోంది.

## ఎండల్లో బయటకు రావొద్దు

### అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 14 :** రాష్ట్రంలో ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతోంది. ఉదయం 9 దాటితే బయటకు రావడం కష్టంగా మారింది. ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా తప్పనిసరిగా ధరించాలని దిశానిర్దేశం చేశారు. ఎండదెబ్బ ప్రమాదమని.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలుడు

### 10 మంది కార్మికులు మృత్యువాత

**రాయపూర్, ఏప్రిల్ 14 :** ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సక్తి జిల్లాలోని వేదాంత పవర్ ప్లాంట్లో బాయిలర్ పేలడంతో 10 మంది కార్మికులు మృతి చెందగా, సుమారు 40 మంది గాయపడ్డారు. ఈ ఘటన అకస్మాత్తుగా బాయిలర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సంఘటన సమయంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి గల అసలు కారణాలు ఏమిటి అనే దానిపై పరిశీలన కొనసాగుతోంది.

# యుద్ధోన్మాద మత్తు దిగితేనే.. ప్రపంచశాంతి!



నోబెల్ శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్..యుద్ధోన్మాదిగా మారాడు. ఆయనకు తోడుగా ఇజ్రాయల్ ప్రధాని బెంజ్‌మెన్ న ఎతన్యాహు తోడయ్యారు. వీరిద్దరు కలసి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న తీరుతో ప్రపంచ దేశాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే అమెరికా ఎంతగా నష్టపోయినా సరే ట్రంప్ మాత్రం యుద్ధాన్ని వీడేది లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. చర్చలు విఫలం అయితే దానికి ఎక్కువ బాధ్యత అమెరికాదే. ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టిందే వారు. ఇప్పుడు దానికి అణుబూచి రంగు పులిమి ఇరాన్‌ను దెబ్బతీయాలని చూడడం సరికాదు. నిజానికి ప్రపంచదేశాలు ట్రంప్ తీరుపై గళమెత్తాలి. కానీ ఏ దేశం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. భారత్ కూడా మాటకూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే ఇప్పుడు యుద్ధం ముగించకుంటే చమురు మంటలు అన్ని దేశాలను దహించి వేస్తాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడుతారు.

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. పాకిస్థాన్ వేదికగా జరిగిన ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లే కన్పించినా.. చివరి నిమిషంలో వీటికి బ్రేక్ పడింది. ఇందుకు కారణం అణు కార్యకలాపాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడమేనని తాజాగా తెలిసింది. 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధి నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదన పెట్టగా, అందుకు ఇరాన్ నిరాకరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. యురేనియం శుద్ధిని ఐదేళ్ల పాటు మాత్రమే నిలిపివేస్తామని టెహ్రాన్ చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు అగ్రరాజ్యం సమ్మతించకపోవడంతోనే చర్చలు ఆగిపోయినట్లు తెలిపాయి. వాస్తవానికి టెహ్రాన్ శాశ్వతంగా యురేనియం శుద్ధిని నిలిపివేయాలని ట్రంప్ యంత్రాంగం ముందునుంచీ డిమాండ్ చేసింది. కానీ చర్చల సమయంలో దాన్ని 20 ఏళ్లకు తగ్గించడం గమనార్హం. అయితే ఈ పీటముడి ఇలాగే ఉంటుందా...అమెరికా మళ్లీ యుద్ధానికి కాలుదువ్వుతుందా అన్న ఆందోళన ప్రపంచ దేశాలను కలచివేస్తోంది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా-ఇరాన్ మధ్య ఈ స్థాయిలో అత్యున్నత స్థాయి సమావేశం జరగడం మళ్లీ ఇప్పుడే. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ భేటీలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ సహా ఇరుదేశాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు 20 గంటల పాటు ఈ చర్చలు సాగాయి. 80శాతం అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది.

ఒప్పందం దాదాపు కుదిరినట్లుగానే కన్పించింది. కానీ, కాసేపటికే అవి విఫలమయ్యాయని పాక్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ చర్చలు పూర్తిగా నిలిచిపోలేదని, రెండోదశ ముఖాముఖి భేటీకి ఇరుదేశాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. డీల్ కుదుర్చుకునేందుకు తాము సుముఖంగానే ఉన్నామని ఇరాన్ తమతో చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చలు సాఫీగా సాగేలా పట్టువిడుపులు ఉండాల్సిందే. దెబ్బతిన్న ఇరాన్ పునరుద్దరణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎందుకంటే చమురు సంక్షోభం ముదరకుండా చూసుకోవాలి. ఇప్పటికే బ్యారెట్ ధర 113 డాలర్లకు చేరింది. ఇది ఆయా దేశాలపై మోయలేని భారం చూపనుంది. అందుకే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది దాంతో రానున్న వారాల్లో చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కూడా హెచ్చరించారు. ర్మూజ్‌లో నౌకల రాకపోకలు మొదలైనా.. రవాణా మునుపటి స్థాయికి చేరేవరకు ఈ మోత ఉంటుందని హెచ్చరించారు. హొ ర్మూజ్ లో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో పెరిగే వరకు ఇంధన ధరల అధికంగా ఉండొచ్చు. పెరుగుతూనే ఉండొచ్చు . చమురు ధరలు తగ్గొచ్చని అందరూ అంచనా వేస్తున్నారు. ఇక నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల వరకు ఇంధన ధరలు ఎక్కువగానే ఉండొచ్చని ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సూచనప్రాయంగా వెల్లడించారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మార్చి నెలలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తి భారీగా తగ్గిందని ఒపెక్ విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడవుతోంది.

ఇరాక్‌లో దాదాపు 61శాతం మేర ఉత్పత్తి తగ్గింది. ఫిబ్రవరిలో రోజుకు 4.2 మిలియన్ బ్యారెళ్ల నుంచి మార్చిలో రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. కువైట్‌లో 53శాతం, యూఏఈలో 44 శాతం, సౌదీ అరేబియా 23 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. ఇక చమురు సరఫరాలో కీలకమైన పైప్‌లైన్ ఇరాన్ దాడుల్లో దెబ్బతినడంతో రోజూవారీ 7 మిలియన్ల బ్యారెళ్ల నుంచి 7 లక్షల బ్యారెళ్లకు పడిపోయిందని సౌదీ మీడియా వెల్లడించింది. మొత్తంగా ఒపెక్ దేశాలు చేసే ఉత్పత్తి 27 శాతం మేర కుంగింది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం అమెరికా నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. అందుకు తగ్గట్టే ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోకుండా.. అమెరికా ఆంక్షలున్న చైనా ట్యాంకర్ హర్మూజ్‌ను దాటింది. మరిప్పుడు దీనిపై యూఎస్ నౌకాదళం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది. మొత్తంగా ఈ దోబూచులాట ఆగాలి. చమురు దేశాలు స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునే స్థితి రావాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి వస్తుంది. ట్రంప్ కూడా మూర్ఖంగా ముందుకు వెళ్లకుండా ప్రపంచశాంతికి కట్టుబడి ఉండాలి.



## అంబేద్కర్‌కు మోడీ నివాళులు

### దేశ నిర్మాణాంలో అంబేద్కర్ కృషి అపూర్వమని వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 :** డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేద్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.మరోవైపు అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సిఎం రేవంత్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్రాల ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు.

## అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దే

### అంబేద్కర్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఏప్రిల్ 14 :** బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాడితే పోయేదేమీ లేదన్న శ్రీశ్రీ చెప్పిన మాట నిజం అయిందని.. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి సంకెళ్లు వేసి బందీ చేసిందని ఆరోపించారు. ఈసారి బందీ చేస్తే సంకెళ్లు బద్దలు కొడతామని పిలుపు ఇచ్చిన వెంటనే విగ్రహాన్ని ఓపెన్ చేశారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ తత్వం 'బోధించు, సమీకరించు, పోరాడు'తోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని కేటీఆర్ పేర్కొన్నారు. గురుకులాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుంటోంది తప్ప.. ఎన్నడూ నిజమైన గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత కాలం అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వలేదన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయకుండా ఆయనను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు లాంటి పథకాలను తీసుకొచ్చిన కలేజా ఉన్న నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో అవకాశాలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని మాజీ మంత్రి విమర్శించారు. లక్షన్నర కోట్ల కాంట్రాక్టుల్లో 72 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మూసి కాంట్రాక్టు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తారా అని నిలదీశారు. కాంగ్రెస్ మోసాలను రాష్ట్రంలోని ప్రతి దళిత, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చేర్చి పోరాడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్ హాజరవుతాని ప్రకటించారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌పై బహిరంగ సభలు నిర్వహించేలా ఎ÷-లాన్ చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని బీజేపీని డిమాండ్ చేశామని.. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని కేటీఆర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లకు ఏ మాత్రం గౌరవం ఉన్నా స్పందించే వారన్నారు.

## భారత ప్రజాస్వామ్య పటిష్టతకు అంబేద్కర్ కృషి

### ఆయన రాజ్యాంగంతో ఐక్యంగా దేశం అభివృద్ధి

### జయంతి వేడుకల్లో మాజీమంత్రి హరీష్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 14 :** ప్రపంచంలోనే భారత్ అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉందంటే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తి వల్లేనని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు ముక్కలవుతున్నాయని, అంతర్గత యుద్ధాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలో 28 రాష్ట్రాలు ఉన్నా దేశం ఒక్కటిగా వర్ధిల్లుతుందన్నారు. అందుకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం తడకపల్లిలో బాబా సాహెబ్ విగ్రహాన్ని హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కొందరివాడు కాదని.. అందరి వాడని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. 'చాలా దేశాలు విడిపోతున్నాయి. అంతర్యుద్ధాలతో సతమతమవుతున్నాయి. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా దేశం ఒక్కటిగానే ఉంది. అందుకు అంబేద్కర్ మహానుభావుడే కారణం. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు ఓటు హక్కు రావడానికి చాలా దశాబ్దాలు పట్టింది. కానీ, మన రాజ్యాంగంలో మహిళలు, పురుషులు, కోటీశ్వరులు, పేదవారనే తేడా లేకుండా అంబేద్కర్ అందరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య స్ఫూర్తికి నాంది పలికారని గుర్తు చేశారు. ఆయన చాలా పేద కుటుంబంలో జన్మించారు. యువత బాబాసాహెబ్‌ను చూసి స్ఫూర్తి పొందాలి. అణగారిన వర్గాల కోసం ఆయన కృషి చేశారు. దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకాన్ని మాజీ సీఎం కేసీఆర్ తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ పెట్టి రెండున్నర ఏళ్లయినా ఒక్క హామీ అమలు చేయలేదు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక మధ్యలోనే చదువులు ఆగిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్‌ను డమ్మీ చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ఆగిపోయింది. సెక్రటేరియట్‌కి అంబేద్కర్ పేరు పెట్టాం. దేశంలో ఏ రాష్ట్రం అలా చేయలేదు. అంబేద్కర్ ఆలోచనతోనే తెలంగాణ వచ్చింది. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ పెట్టారని రేవంత్ రెడ్డి ఆ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయడం లేదని అన్నారు.

## సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

### ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

**హైదరాబాద్, ఏప్రిల్ 14 :** ఆర్టీసీ పరిరక్షణ - ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని సంస్థ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.సమస్యలు చెప్పుకోవడానికి తమ తలుపులు తెరిచే ఉన్నాయి.. ఎవరైనా వచ్చి తమ సమస్యలు చెప్పుకోవచ్చునని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల అంశాలు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి ఏర్పాటు చేసిన కమిటీ పని చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ డిమాండ్ల నెరవేరని పక్షంలో ఏప్రిల్ 22వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ సోమవారం ప్రకటించింది. 21వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు నిలిపి వేస్తామని స్పష్టం చేసింది. 22వ తేదీ తెల్లవారుజాము నుంచి సమ్మెలోకి వెళ్తామని పేర్కొంది. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశమయ్యారు. అనంతరం ఆర్టీసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ.. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆర్టీసీ సంస్థ నుంచి అధికారులు రాలేదని స్పష్టం చేశారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం నుంచి లేఖ మాత్రం వచ్చిందన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని ఈ సందర్భంగా యాజమాన్యం స్పష్టం చేసిందని చెప్పారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు ఎన్నికలు సహా మరో 30 డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ నేతలు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పైవిధంగా స్పందించారు.

## యూపిలో కార్మికుల కనీస వేతనంపై 3వేలు పెంపు

### కార్మికుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

**లక్నో, ఏప్రిల్ 14 :** ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కార్మికుల కనీస వేతనాలను రూ.3వేలు వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కనీస వేతనం పెంచాలంటూ నోయిడా , ఘజియాబాద్‌లోని కార్మికులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. నోయిడా, ఘజియాబాద్‌లలోని నైపుణ్యం లేని కార్మికుల నెలవారీ వేతనాలు రూ.11,313 నుంచి రూ.13,690కి పెంచింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఇతర రంగాల కార్మికులకు కూడా వేతనాలు పెంచుతున్నట్లు పేర్కొంది. అయితే, మున్సిపల్ కార్పొరేషన్లు, జిల్లాల్లో ఈ వేతన పెంపు వేర-ువేరుగా ఉంటుందని స్పష్టంచేసింది. ఇది తాత్కాలిక నిర్ణయం మాత్రమేనని.. వేతన మండలి సమగ్ర సమీక్ష తర్వాత దీనిపై పూర్తి నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. నోయిడాలో మంగళవారం కూడా ఆందోళనలు చెలరేగాయి. తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న కార్మికులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. వేతనాలు పెంచాలంటూ సోమవారం నోయిడాలో వేల మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. కొంతసేపటికే అవి హింసాత్మకంగా మారాయి. పోలీసుల పైకి రాళ్లు రువ్వడంతో సహా కార్లు తగలబెట్టడం, రహదారులను దిగ్బంధించడం వంటివి చోటుచేసుకున్నాయి. పరిశ్రమలోని సీసీటీవీ దృశ్యాల ఆధారంగా హింసాత్మక ఘటలనకు పాల్పడిన 300 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. ఇక్కడ ఇటీవల పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో కొందరు వ్యక్తుల అరెస్టులు జరిగాయి. ఈ క్రమంలో తాజా ఘర్షణల్లో పాక్ ప్రమేయం ఉందేమోనన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఉత్తరప్రదేశ్ కార్మికశాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ పేర్కొన్నారు.

## ఏపీ సీట్ల పెంపుతో ఉత్తరాదికే మేలు

### దక్షిణాది ప్రభావం తగ్గడం ఖాయం

### సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 :** మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణల కోసం కేంద్రం ఏర్పాటు చేయనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ స్పందించారు. ఈ సవరణలతో దక్షిణ భారత దేశం కంటే ఉత్తర భారత దేశానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు 63 నుంచి 65 లోకసభస్థానాలు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలకు కనిష్టంగా 200కు పైగా సీట్లు పెరుగుతాయని, దీంతో జాతీయ రాజకీయాల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816 స్థానాలకు పెంచే లక్ష్యంతో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను కేంద్రం ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ముందునుంచి తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు నిరసిస్తున్నాయి. దక్షిణాదిపై కుట్రగా అభివర్ణిస్తున్నాయి.

## జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం

- షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధికి కృషి
- ఏపి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి, ఏప్రిల్ 14 :** జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం చేస్తోందని ఎపి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధి చెందబోతోందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా ఏపీ నిలవనుందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను రూ.288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధిచేశామని మంత్రి తెలిపారు. హార్బర్ నిర్మాణం ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాల జీవితాలు సమూలంగా మారబోతున్నాయని మంత్రి అనగాని అన్నారు. 1,250 మెకనైజ్డ్, మోటరైజ్డ్ చేపల పడవలను సురక్షితంగా నిలిపేలా సదుపాయం కల్పించామన్నారు. కానీ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న మాజీ సీఎం జగన్ రెడ్డి జువ్వలదిన్నెపై విషం కక్కుతున్నారంటూ విరుచుకుపడ్డారు. జగన్ రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉండి.. ఒక్క హార్బర్‌ను గానీ, ఒక్క పోర్టును గానీ పూర్తి చేయలేక పోయారని అన్నారు. జువ్వలదిన్నె హార్బర్, రామాయపట్నం పోర్టులకు పట్టిన గ్రహణం జగన్ రెడ్డి అంటూ వ్యాఖ్యానించారు. గన్ ఆర్థిక ప్రయోజనాల కోసం తీరంలో కొత్త పోర్టులు, హార్బర్లు రాకుండా గతంలో మాజీ సీఎం వైఎస్సార్ జీవోలు ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ చర్యలతో జువ్వలదిన్నె హార్బర్‌తో పాటు రామాయపట్నం పోర్టులో కదలికవచ్చిందన్నారు. 2019 మార్చి 7న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు రూ. 288 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక టెండర్లు ఇచ్చి డబ్బులు తిన్నారే తప్ప జువ్వలదిన్నె హర్బర్ నిర్మాణం పట్టించుకోలేదని ఆరోపించారు. 15వ తేదీన ఏం చెప్పడానికి జగన్ జువ్వలదిన్నె వస్తున్నారని ప్రశ్నించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి వాడరేవు వరకు తీరంలో ఏ నిర్మాణం చేపట్టకుండా తండ్రి అధికారంతో జీఓ తెచ్చానని చెబుతారా అంటూ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



## ఐఐటి, ఒలింపియాడ్‌లో
# బీఎంఆర్ఎస్ ప్రతిభ

- రాష్ట్రస్థాయి ర్యాంకులతో మెరిసిన బీఎంఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్
- విద్యార్థులను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ జైపాల్ రెడ్డి

**బోడుప్పల్, నేడు న్యూస్:** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల బీఎంఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన ఐఐటి, ఒలింపియాడ్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఐఐటి, ఒలంపియాడ్ పరీక్షల్లో స్టేట్ ర్యాంక్స్ సాధించి పాఠశాలకు కీర్తి తీసుకొచ్చారు. సి-బ్యాట్, సి-మ్యాట్, ఆర్ఎస్ఎం, ఆర్ఎంఎం, కె-సాట్, కెసిసిఎం వంటి వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ విజయాల వెనుక విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధతతో కూడిన బోధన, తల్లిదండ్రుల నిరంతర సహకారం ప్రధాన కారణమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. చిన్న వయస్సులోనే పోటీ ప్రపంచానికి సిద్ధమవుతూ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి. జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో నాణ్యమైన విద్య, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత బోధన, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.



## అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం
### నత్తి మైసయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**బోడుప్పల్, నేడు న్యూస్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించ నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలు, ఆకాంక్షల కోసం కృషి చేయాలని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదగాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య రాపోలు శ్రీరాములు, బిజెపి నాయకులు గోనె శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దానగల యాదగిరి, అంబేద్కర్ ఆశ సాధన సంఘం సభ్యులు నత్తి దర్శన్, కామగళ్ల బాబు, గరుగుల యాకయ్య, సగ్గు నర్సింహా, బెక్కం శివ, ఏసురాజు, జై భీమ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.




## సురేందర్‌కు లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు

**కూకట్‌పల్లి, నేడు న్యూస్:** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాయింట్ సెక్రటరీగా, బాలానగర్ నివాసి సురేందర్‌కు ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రతిష్టాత్మక లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఈ అవార్డును విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ విజయకుమారి అందజేశారు. సమాజ సేవలో సురేందర్ చేసిన కృషిని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని అభినందనలు తెలిపారు.



## అంబేద్కర్ ఆశయాలను సాధిద్దాం
### ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

**మేడ్చల్ నేడు బ్యూరో:** డాక్టర్:బి. ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్దదిగా, దృఢమైనదిగా నిలిచిందన్నారు. అలాగే, ఉపాధ్యాయులకు శాసనమండలిలో ప్రాతినిథ్యం కల్పించడం రాజ్యాంగం ఇచ్చిన గొప్ప అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్ టి.యు రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్ రెడ్డి, పీ.ఆర్.టీ.యు అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకట్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ, మేడ్చల్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

## త్రివిధ్య జూనియర్ కళాశాల
# 'ర్యాంకుల' మాయాజాలం

- అనుమతులు లేవు.. భద్రత అసలే లేదు !
- అనుమతి లేని అడ్మిషన్లు.. గాలిలో విద్యార్థుల భవిష్యత్తు
- ఫైర్ సేఫ్టీ నిల్.. భవనం నిండా రిస్కే!
- పది పరీక్షలు ముగియగానే ఫోన్ల వేధింపులు
- ర్యాంకుల పోస్టర్ల వెనుక అసలు రంగు
- నిమ్మకు నీరెత్తినట్లు విద్యాశాఖ అధికారులు
- రంగురంగుల పోస్టర్లను చూసి మోసపోకండి



భవనం ముందు ఇతర బ్రాంచులలో మార్కులు సాధించిన ర్యాంకుల పోస్టర్లు




కళాశాలను సీజ్ చేయాలని భవనం ముందు ధర్నా చేస్తున్న యుఎస్ఎఫ్ఐ నాయకులు

**మేడ్చల్, నేడు న్యూస్ :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థలు నేడు లాభార్జనే ధ్యేయంగా మారుతున్నాయి. మేడ్చల్ పరిధిలోని 'త్రివిద్య జూనియర్ కళాశాల' నిబంధనలను బేఖాతరు చేస్తూ, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. కనీస అనుమతులు లేకున్నా, ఆకాశమే హద్దుగా ప్రచారాలు చేస్తూ అడ్మిషన్ల పేరిట తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తోంది.

**అనుమతి లేని అడ్మిషన్లు.. విద్యార్థుల భవిష్యత్తు గాలిలో! :**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాల నడపాలంటే విద్యాశాఖ నుండి గుర్తింపు తప్పనిసరి. కానీ, మేడ్చల్‌లోని త్రివిద్య కళాశాలకు ఎటు వంటి అధికారిక అనుమతులు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేని కాలేజీలో అడ్మిషన్లు తీసుకుంటే, రేపు విద్యార్థుల సర్టిఫికెట్ల పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. కేవలం అడ్మిషన్లే లక్ష్యంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పుడే భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం గమనార్హం.

**ఫైర్ సేఫ్టీ నిల్.. భవనం నిండా రిస్కే! :**

ఫోటోలలో కనిపిస్తున్న భవనాన్ని గమనిస్తే, అది కనీస భద్రతా ప్రమాణాలకు లోబడి ఉన్నట్లు కనిపించడం లేదు. ముఖ్యంగా 'ఫైర్ సేఫ్టీ' (అగ్నిమాపక భద్రత) సర్టిఫికేట్ లేకుండానే వందలాది మంది విద్యార్థులను ఏసీ గదుల్లో ఉంచి పాఠాలు చెప్పడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేపు ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే దానికి బాధ్యులు ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**పది పరీక్షలు ముగియగానే ఫోన్ల వేధింపులు :**

పదవ తరగతి పరీక్షలు పూర్తి కాగానే, విద్యార్థుల డేటాను అక్రమంగా సేకరించి తల్లిదండ్రులకు ఫోన్లు, మెసేజ్‌లతో వేధింపులు మొదలుపెట్టారు. "మా దగ్గర అద్భుతమైన ఫ్యాకల్టీ ఉంది, ఏసీ క్యాంపస్ ఉంది" అంటూ ప్రలోభాలకు గురిచేస్తూ లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడమే ధ్యేయంగా త్రివిద్య యాజమాన్యం వ్యవహరిస్తోంది.

**ర్యాంకుల పోస్టర్ల వెనుక అసలు రంగు :**

భవనం ముందు భారీగా ఏర్పాటు చేసిన ర్యాంకుల పోస్టర్లు కేవలం విద్యార్థులను ఆకర్షించే ఎర మాత్రమే. అనుమతులే లేని కళాశాల ఇంత పెద్ద ఎత్తున ర్యాంకులు ఎలా సాధిస్తుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిబంధనలను గాలికి వదిలేసి, కేవలం వ్యాపార దృక్పథంతోనే ఇలాంటి పోస్టర్లతో పబ్లిసిటీ చేసుకుంటున్నారని విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

**నిమ్మకు నీరెత్తినట్లు విద్యాశాఖ అధికారులు! :**

ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేని భవనాల్లో కళాశాలలు నిర్వహిస్తున్నా, నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్నా అధికారులు మౌనం వహించడం వెనుక మతలబు ఏంటని ప్రజలు అడుగుతున్నారు.

**రంగురంగుల పోస్టర్లను చూసి మోసపోకండి :**

తల్లిదండ్రులారా మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కేవలం రంగురంగుల పోస్టర్లను చూసి మోసపోకండి. కళాశాలకు అనుమతులు ఉన్నాయా లేదా ? భవనం సురక్షితమేనా ? అనే విషయాలను విచారించిన తర్వాతే అడుగు ముందుకు వేయండి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇలాంటి అక్రమ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## సామాజిక న్యాయం కోసం
# అంబేద్కర్ కృషి

### పీర్జాదిగూడలో ఘనంగా బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** సమానత్వం, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేడిపల్లి వెస్ట్ క్రాంతి కాలనీ అధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో వెస్ట్ క్రాంతి కాలనీలో, మేడిపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని, యువత ఆయన





ఆలోచనలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలనే ఆయన ఆశయాలను కొనసాగించడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. కృష్ణ, సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, మల్లా రెడ్డి, శివరాజ్, రవి, కళ్యాణ్, అశోక్, మధు, సత్యనారాయణ, సామ వెంకట్ రెడ్డి, శైలేష్ రెడ్డి, తిరుమలేష్, క్రాంతి, బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మనోరంజన్ రెడ్డి, మల్లం వెంకటేష్, రఘువర్ధన్ రెడ్డి, నిర్మల, జావేద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





## లండన్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు
### ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, నేడు న్యూస్:** కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని, సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు అంబేద్కర్ జయంతిని జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు. అంబేద్కర్ లండన్‌లో గడిపిన కాలం ఆయన జీవితంలో కీలక దశగా నిలిచిందని తెలిపారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకానామిక్స్‌లో ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించడంతో పాటు గ్రేస్ ఇన్‌లో న్యాయ విద్యను అభ్యసించారు. ఆర్థిక శాస్త్రంలో ఉన్నత విద్యను పూర్తిచేసి డాక్టరేట్ పొందారు. బ్రిటిష్ పాలనలో భారత ఆర్థిక పరిస్థితులపై లోతైన పరిశోధనలు చేసి 'ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ' వంటి ప్రముఖ గ్రంథాన్ని రచించారు. లండన్‌లో న్యాయవేత్తగా శిక్షణ పొందడం ద్వారా భారతదేశంలో ప్రముఖ న్యాయవేత్తగా ఎదగడానికి బలమైన పునాది ఏర్పడింది. యూరప్‌లోని ప్రజాస్వామ్య వ్యవస్థలు, సమానత్వ భావనలు ఆయన ఆలోచనలపై ప్రభావం చూపించాయి. అణగారిన వర్గాల కోసం పోరాడే సంకల్పం మరింత బలపడింది. బ్రిటిష్ పాలన విధానాలు, చట్టాలపై లోతైన అవగాహన ఆయనకు ఏర్పడి, అది భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలకంగా ఉపయోగపడింది. లండన్‌లో విద్య, పరిశోధన, ఆలోచనా పరంగా తనను తాను తీర్చిదిద్దుకున్న అంబేద్కర్, అదే ఆధారంగా భారత రాజ్యాంగ నిర్మాతగా నిలిచారు అన్నారు.

# అంబేద్కర్ అడుగుజాడలలో నడవాలి

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి
- జిల్లాలో అంబేద్కర్ కు ఘనంగా నివాళి అర్పించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు




**మేడ్చల్, నేడు బ్యూరో:** దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాల వారికి హక్కులు కల్పించి సార్వభౌమాధికారాన్ని అందించేందుకు అనుగుణంగా, రాజ్యాంగాన్ని రూపొందించిన శిల్పి డాక్టర్: బి.ఆర్. అంబేద్కర్ అని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉప్పల్ లో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన ( జిల్లా స్థాయి ) డాక్టర్: బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ



సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహాలను పెట్టుకోవడం కాదని, ఆయన ఇచ్చిన రాజ్యాంగంలోని అంశాలను పాటిస్తూ వారి అడుగుజాడలలో నడవాలని సూచించారు. ప్రస్తుతం యావత్ భారతదేశం ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటున్నదన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం లోని రిజర్వేషన్ల ద్వారా సమాజంలో సమానత్వం కల్పించారన్నారు. కుల, మత నిర్మూలన చేసి సమ సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. డాక్టర్: బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగంలోని రిజర్వేషన్ల వలన బడుగు బలహీన వర్గాల వారు కూడా రాజకీయ, వ్యాపార ఆర్థిక రంగాలలో ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. సమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు డాక్టర్: బి.ఆర్ అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని ఆయన అందించిన రాజ్యాంగంలోని అంశాలను అమలయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వెనుకబడిన వారికి అందించే పథకాలపై ప్రజలలో విస్తృతంగా ప్రాచుర్యం కల్పించి వారికి లబ్ధి చేకూరేలా సంఘాల నాయకులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సంస్థ కళాకారులు ఆలపించిన అంబేద్కర్ పాటలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. అనంతరం మేడ్చల్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక చెక్కులను అదనపు కలెక్టర్ అందించారు. దళితుల అభ్యున్నతికి కృషి చేసిన వారికి దళిత రత్న అవార్డులు ఎమ్మెల్యే లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా లైబ్రరీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ జైపాల్ రెడ్డి హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ జి. వినోద్ కుమార్, కీసర ఆర్.డీ.ఓ రాజేష్ కుమార్, ఏసీపీ వెంకట్ రెడ్డి, ఉప్పల్ ఎం.ఆర్.ఓ ఫూల్ సింగ్, డీ.ఆర్.డీ.ఓ సాంబశివరావు, ఎల్.డి.ఎం శివ ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పద్మజ, కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

# మైపీ వెంచర్‌లో తొలగించని అక్రమ ప్రహారీ నిర్మాణాలు!


- నోటీసులు కాగితాలకే పరిమితం
- కమిషనర్ ఆదేశించినా ఆగని ప్రహరీ నిర్మాణం !
- టీపీవో మౌనం.. అక్రమార్కులకు వరమా ?
- వ్యవస్థ తీరుపై స్థానికుల నిరసన
- హెచ్ఎండీఏ కళ్లుగప్పి 'గ్రీన్ జోన్' మాయాజాలం
- డ్రాఫ్ట్ ప్లాన్‌లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా !
- నోటీసుల గడువు ముగిసినా కదలని యంత్రాంగం
- అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికుల డిమాండ్




కమిషనర్ అందజేసిన నోటీసులకు సంబంధించిన వెంచర్ ప్రవేశద్వారం

**మేడ్చల్, నేడు న్యూస్ :** ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని నూతన్‌కల్ గ్రామంలో వెలుగుచూసిన అక్రమ నిర్మాణాల వ్యవహారం ఇప్పుడు స్థానికంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, సామాన్యుల హక్కులను కాలరాస్తూ సాగుతున్న 'రియల్' దందా వెనుక అసలు సూత్రధారులు ఎవరనే చర్చ మొదలైంది.

**నోటీసులు జారీ.. నిర్మాణం పూర్తి :**


ఎల్లంపేట పురపాలక కమిషనర్ అందజేసిన మొదటి నోటీస్


ఎల్లంపేట పురపాలక కమిషనర్ అందజేసిన రెండవ నోటీస్

సాధారణంగా పురపాలక అధికారులు నోటీసులు ఇస్తే ఏ సామాన్యుడైనా భయపడతాడు. కానీ నూతన్‌కల్ గ్రామంలోని సర్వే నెంబర్లు 555, 556, 566, 567, 573 పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్ నిర్వాహకులకు మాత్రం ప్రభుత్వ నోటీసులంటే లెక్కలేనట్టు కనిపిస్తోంది. ఎల్లంపేట పురపాలక కమిషనర్ స్వయంగా జూలై 9, 2025న మొదటిసారి, జూలై 30, 2025న రెండవసారి నోటీసులు జారీ చేసినప్పటికీ, అక్కడ అక్రమ ప్రహరీ గోడల నిర్మాణం ఆగకపోగా.. మరింత వేగంగా పూర్తవడం గమనార్హం. నోటీసుల కాలపరిమితి ముగిసినా, అధికారులు చర్యలకు దిగకపోవడం వెనుక ఉన్న 'అదృశ్య శక్తి' ఏమిటన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది.

**టీపీవో మౌనం.. వ్యవస్థపై అనుమానం :**

అక్రమ నిర్మాణాలను పర్యవేక్షించి, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పై ఉంటుంది. అయితే, ఈ వ్యవహారంలో టీపీవో అనుసరిస్తున్న తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ నోటీసులు ఇచ్చినా, క్షేత్రస్థాయిలో కూల్చివేతలు చేపట్టకపోవడం వెనుక కారణాలేంటి ? ఇది కేవలం విధి నిర్వహణలో నిర్లక్ష్యమా లేక రియల్ మాఫియా ఒత్తిడికి తలొగ్గడమా ? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

**హెచ్ఎండిఏను తప్పుదోవ పట్టించారా ? :**

ఈ వెంచర్ నిర్వాహకులు ఉన్నతాధికారులను సైతం మభ్యపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్ఎండీఏకు సమర్పించిన డ్రాఫ్ట్ ప్లాన్‌లో గ్రీన్ జోన్లుగా చూపించిన స్థలాల్లో, వాస్తవానికి కాంక్రీట్ నిర్మాణాలు వెలుస్తున్నట్లు తెలుస్తోంది. తనిఖీల సమయంలో అధికారులకు ఒకలా, పనులు చేసేటప్పుడు మరోలా వ్యవహరిస్తూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారన్నది బహిరంగ రహస్యంగా మారింది.

**తేల్చాల్సింది ఎవరు? :**

ప్రభుత్వ భూములను, రైతుల దారులను కాపాడాల్సిన బాధ్యత కలెక్టర్ మరియు ఉన్నతాధికారులపై ఉంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి, ఎల్లంపేట పురపాలక పరిధిలో జరుగుతున్న ఈ అక్రమ వెంచర్ దందాపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నోటీసులను బేఖాతరు చేసిన ప్రహరీ గోడలను కూల్చివేసి, వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.





## ఘనంగా అంబేడ్కర్ జయంతి

### జిల్లా కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు

**ఉప్పల్/ కుషాయిగూడ, నేడు న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా మంగళవారం కుషాయిగూడ లోని జిల్లా కోర్టులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు అధ్యక్షత వహించి అంబేడ్కర్ సేవలను స్మరించుకున్నారు. భారత రాజ్యాంగ పితామహుడిగా అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు అమూల్యమని కొనియాడారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నయ్య మాట్లాడుతూ అంబేద్కర్ 135వ జయంతి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు దుర్గ ప్రసాద్, ప్రశాంతి, రాజు లాడే, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ తో పాటు న్యాయ వాదులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సదస్సు ద్వారా అంబేడ్కర్ ఆలోచనలు, న్యాయ పరమైన విలువలు నేటి తరానికి మార్గదర్శకమని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.



## అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళి మజ్జిగ పంపిణీ

**ఉప్పల్, నేడు న్యూస్:** డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఇర్షాద్ ఖాన్ పూలమాలలు వేసి నివాళి తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, హక్కుల కోసం అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకున్నారు. వేసవి వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద మజ్జిగ పంపిణీ నిర్వహించారు. స్థానికులు, ప్రయాణికులు, కార్మికులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డి మార్గదర్శకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు అయిన సమానత్వం, విద్య, ఐక్యతను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఉప్పల్ డివిజన్ అభివృద్ధికి కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్దూమ్ భాయ్, బాబా భాయ్, పవన్, రాజశేఖర్, శ్రీకాంత్, భరత్, గఫూర్ భాయ్, మహమ్మద్ అన్వర్, అఫ్జల్, మొహ్సిన్, ఆసిఫ్, మౌలానా, నాగూర్ బాషా, మాలిక్ బాషా పాల్గొన్నారు.



## అంబేద్కర్‌కి నివాళి

**కీసర, నేడు న్యూస్:** భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రవి రాజ్ రాథోడ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సాయి ప్రసాద్, మురళి నాయక్ తదితరులు పాల్గొని అంబేద్కర్ సేవలను కొనియాడారు. అంబేద్కర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు, ఒక విప్లవాత్మక ఆలోచన అని, అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని రవి రాజ్ రాథోడ్ పేర్కొన్నారు. "విద్య, సంఘటితం, పోరాటం" అనే సూత్రాలను యువత తమ జీవితాల్లో అలవర్చుకోవాలని, సమాజంలోని అన్యాయంపై గళమెత్తడమే ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవమని వక్తలు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలతో కూడిన భారతదేశాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆకాంక్షించారు.



## అంబేద్కర్ జయంతి వేడుకలు

### నివాళులర్పించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్

**ఉప్పల్, నేడు న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పలు ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉప్పల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన నివాళులు అర్పించారు. అనంతరం చిలకనగర్ డివిజన్లో షెడ్యూల్డ్ కాస్ట్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈస్ట్ కళ్యాణపురి వార్డ్ కార్యాలయం పరిధిలో సందీప్ భూషణ్ మరియు కమిటీ సభ్యులు నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్కు ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా మేడ్చల్–-మల్కాజ్గిరి జిల్లా ప్రభుత్వ షెడ్యూల్డ్ కాస్ట్స్ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎద్దుల కొండల్ రెడ్డి, కొకొండ జగన్, బింగి శ్రీనివాస్, మాసా శేఖర్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, అశోక్ చారి, సుందర్, ఎండీ షఫీ, ఎండీ హనీఫ్, నర్సింగ్, శ్యామ్, బాలూ తదితరులు పాల్గొన్నారు.

## 7వ రోజుకు చేరిన ఆర్టిజన్ విద్యుత్ ఉద్యోగుల సమ్మె

### ప్రభుత్వం స్పందించాలంటూ డిమాండ్



**కూకట్‌పల్లి, నేడు న్యూస్:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లకు చెందిన ఆర్టిజన్ విద్యుత్ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తమ సమస్యలను ప్రతిబింబించే వినతి పత్రాన్ని అంబేద్కర్ చిత్రపటానికి సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25,000 వేల మంది ఆర్టిజన్ కార్మికులు ఉన్నప్పటికీ, గత 7 రోజులుగా కొనసాగుతున్న సమ్మెపై ప్రభుత్వం ఇప్పటివరకు చర్చలకు కూడా ఆహ్వానించకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని అన్నారు.ఏప్రిల్ 15 ఉదయం 11 గంటలలోపు విధులకు హాజరుకాకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అధికారులు హెచ్చరించడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడబోమని, తమ హక్కుల సాధన కోసం సమ్మెను మరింత ఉధృతం చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సంస్థలో తాము వివక్షకు గురవుతున్నామని, ఒకే సంస్థలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు ఏపీ.ఎస్.ఈ.బీ సర్వీస్ రూల్స్ అమలు చేస్తుండగా, ఆర్టిజన్ కార్మికులకు మాత్రం 1947 నాటి పాత నిబంధనలు వర్తింపజేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. లైన్మెన్‌ల మాదిరిగానే పనులు చేస్తున్నప్పటికీ తమకు సమాన హక్కులు ఇవ్వడం లేదని, కనీసం ఏపీ.ఎస్.ఈ.బీ సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలని కాకుండా, తగిన హక్కులు, గౌరవం కల్పించాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు.విద్యార్హతల ఆధారంగా పోస్టుల కన్వర్షన్ చేస్తే సంస్థపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదని, ప్రభుత్వానికి కూడా నష్టం ఉండదని పేర్కొన్నారు. ఈ పోరాటం పూర్తిగా తమ ఆత్మగౌరవానికి సంబంధించినదేనని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



**వారి ప్రధాన డిమాండ్లు:**

ఆర్టిజన్ కార్మికులందరికీ ఏపీ.ఎస్.ఈ.బీ సర్వీస్ రూల్స్ అమలు విద్యార్హతల ప్రకారం పోస్టుల కన్వర్షన్ అధికారుల తప్పిదాల వల్ల హోదా పొందని సుమారు 200 మంది కార్మికులకు న్యాయం ఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్న 1600 మంది అన్‌మాన్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తింపు సమస్యల పరిష్కారం వరకు సమ్మె కొనసాగుతుందని కార్మికులు హెచ్చరించారు.



## అంబేడ్కర్ ఆశయాల సాధన కాంగ్రెస్‌తోనే సాధ్యం

### ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సీఎం రేవంత్ రెడ్డి కృషి ఫలితం : మందుముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను సాధించేందుకు దేశంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రేవంత్ రెడ్డి సాధ్యంచేసినట్లు పేర్కొన్నారు. ఈ వర్గీకరణ ద్వారా దళిత సమాజంలోని అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కలిగిందన్నారు. అనేక అడ్డంకులు, ఇబ్బందులు ఎదురైనా సీఎం పట్టుదలతో ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. ఉప్పల్ క్రాస్ రోడ్డు వద్ద కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో అంబేద్కర్ మరియు రాజ్యాంగంపై అవమానకర వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. దేశంలో రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను గౌరవించే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, ఈగ అంజయ్య ముదిరాజ్, రఘుపతి రెడ్డి, తెల్కల మోహన్ రెడ్డి, అకిటి ఆగం రెడ్డి, రాజేష్ ముదిరాజ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, ఖజా మౌలానా, బుసం రఘునాథ్ రెడ్డి, అల్వల్ భాస్కర్, మంద మురళీకృష్ణ రెడ్డి, గొరిగే మహేష్, రామ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బూత్కూర్ రాజు, రత్నం, సత్యనారాయణ చారి, తోకట రాజు, బాకారం అరుణ్, గోపాల్, జనగాం రామకృష్ణ, అఫ్జల్, అన్వర్, కంచమిది శ్రీను, నాగూర్ భాష, మోహన్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తనిఖీల పేరిట డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలి:సత్యనారాయణ



**దేవరుప్పుల, నేడు న్యూస్ :** దేవరుప్పుల మండలంలోని పలు గ్రామాల్లో ఆర్ఎంపీ,పీఎంపీలపై రెండు రోజులుగా ఎన్ఎంసి,టిఎస్ఎంసీ పేరుతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తనిఖీలు చేస్తున్నారు.నేరుగా వారి దగ్గరకు వెళ్ళి 'మీదగ్గరకు వచ్చే రోగులకు ఇంజక్షన్లు ఇవ్వొద్దు, సెలైన్లు ఎక్కించొద్దు, మందులు రాయొద్దు, అసలు మీరు వైద్యమే చేయొద్దు..'అంటూ గ్రామాల్లో తిరు గుతున్నారు.ఇంజక్షన్ల ఫోటోలు,రోగులకు ఇస్తున్న మందు బిళ్లల ఫోటోలు తీసుకొని,ఆ ప్రదేశం మొత్తం వీడియో తీసుకొని ఒక తెల్ల కాగితంపై ఫోన్ నంబర్,సంతకం తీసుకుని తాము రెండు రోజుల్లో మీకు ఫోన్ చేస్తామని చెప్పి వెళ్తున్నారు.ఓ కారులో మొత్తం ఐదుగురు వ్యక్తులు వస్తున్నారని పలువురు ఆర్ఎంపీలు తెలిపారు.దేవరుప్పుల మండలంలో ఆదివారం ముగ్గురు ఆర్ఎంపీల దగ్గరకు వెళ్ళి వాళ్ళదగ్గర డబ్బులు వసూలు చేశారు.సోమవారం కోలుకొండ,చౌడూరు గ్రామాల్లో కోలుకొండలో ఓ ఆర్ఎంపీని డబ్బులు అడగగా తన వద్ద లేవనడంతో వెనుతిరిగారు.బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు దేవరుప్పుల మండల ఎస్సై ఊర సృజన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు.అందులో భాగంగానే మంగళవారం దేవరుప్పుల మండల ఆర్ఎంపి,పీఎంపీ మండల అధ్యక్షుడు మేకపోతుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన మీడియా సమావేశం ఏర్పచగా ముఖ్య అతిథిగా ఆర్ఎంపీ,పీఎంపీ జిల్లా అధ్యక్షుడు పసునూరి సత్య నారాయణ పాల్గొని మాట్లాడుతూ ఎన్ఎంసీ,టిఎస్ఎంసి నుండి వచ్చామని,అందుకే మేము ఆర్ఎంపిలను తనిఖీ చేస్తున్నామని అంటూ నకిలీ సర్టిఫికెట్లు,ఐడి కార్డులు చూపిస్తూ మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా డబ్బులు వసూలు చేస్తున్నారని,వీళ్ళు జిల్లాలోని పలు మండలాలకు వెళ్ళి పలువురు దగ్గర డబ్బులు వసూలు చేశారని,ఇదే విషయాన్ని సంబంధిత అధికారులతో చరవాణిలో విచారించగా వచ్చినవారు ఎవరో,వాళ్లకు మాకు ఇలాంటి సంబంధం లేదని తెలుపగా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై ఊర సృజన్ కుమార్ గారికి మండల ఆర్ఎంపీ,పీఎంపీ గ్రామీణవైద్యులతో కలిసి పిర్యాదు చేశామని,అందుకు ఎస్సై సృజన్ కుమార్ గారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారని,ఎన్ఎంసీ,టిఎస్ఎంసి నుండి వచ్చామని చెప్పి డబ్బులు దండుకుంటున్న ఇలాంటి నకిలీ వాళ్ళను కఠినంగా శిక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్ఎంపీ,పిఎంపి ప్రధాన కార్యదర్శి కొంగ సతీష్,మండల ఉపాధ్యక్షుడు గుండు సుధాకర్,కోశాధికారి తీగల సత్య నారాయణ,గ్రామీణ వైద్యులు శ్రీశైలం,ప్రభాకర్,సతీష్,సిద్ధి రాములు,వాసు,రాజేందర్,అశోక్, ఎల్లయ్య, చక్రపాణి,శ్యామ్, రాంచందర్,సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## మేడ్చల్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుక

**మేడ్చల్ నేడు బ్యూరో:** సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, సహోదర భావం నెలకొల్పడమే అంబేద్కర్ ఆశయాల లక్ష్యమని మేడ్చల్ జిల్లా డీ.సీ.సీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ అన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడవడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏప్రిల్ 14న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ డివిజన్ ఇందిరా నగర్‌లో డాక్టర్: బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఏఐసీసీ ఇంచార్జ మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుల, మత, జాతి భేదాలకు అతీతంగా అందరితో కలిసి ఒకే చోట సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, కూకట్పల్లి ఇంచార్జ బండి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా ఒబిసి సెల్ అధ్యక్షులు రవి ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనోళ్ళ లక్ష్మి, ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 15, 17లలో టు.బి.హెచ్.కె కాలనీలలోని

# వాణిజ్య దుకాణాల వేలం

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి**



**మేడ్చల్ నేడు బ్యూరో:** మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లాలలోని 12 టు.బి.హెచ్.కె కాలనీల సముదాయాలలోని 892 వాణిజ్య దుకాణాల విక్రయాలు ఏప్రిల్ 15,17 లలో వేలం ద్వారా విక్రయించనున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మంగళవారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, వీటి ద్వారా వచ్చే ఆదాయం ఆయా కాలనీల అభివృద్ధికే వినియోగిస్తామన్నారు. ఈ కాలనీలలోని అభివృద్ధి పనులను, ఆయా కాలనీ సొసైటి కమిటీల ప్రతిపాదనలను అనుసరించి మున్సిపల్ కమిషనర్ ద్వారా నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కాలనీలలోని వాణిజ్య సముదాయాలు ఈ నెల15న రాంపల్లి, చైతన్య నగర్, శ్రీరామ్ నగర్, కొర్రెముల, చర్లపల్లిలలో, అలాగే 17న తూంకుంట, మురహరిపల్లి, అహమ్మద్ గూడ కాలనీలు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, కీసర డివిజన్ లో వేలం పాటలు జరుగుతాయని, అలాగే 15 న కైసర్ నగర్, బాచుపల్లి, నిజాంపేట, 17 న దుండిగల్ కాలనీలు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మల్కాజ్ గిరి డివిజన్లో వేలం పాటలు జరుగుతాయని కలెక్టర్ వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనే వారు ఈ కింద పేర్కొన నిబంధనలను పాటించాలి.

1. వేలం రోజు ఉదయం 9 గంటల నుండి 11 గంటల లోపు వేలం లో పాల్గొనాలి. అభ్యర్థులు రూ. 35,000లు ఈ.ఎం.డి ని డి.డి. రూపంలో అధికారులకు సమర్పించాలి ఉంటుంది.
2. వేలం నోటిఫికేషన్ లో పేర్కొన్న అప్ సెట్ ధర మీద వేలు పెంపు ధర చదరపు అడుగుకి రూ. 50లుగా నిర్ణయించబడింది.
3. హెచ్.ఐ అత్యధిక బిడ్డర్ ను ప్రకటించే ముందు కనీసం 3 చెల్లుబాటు అయ్యే బిడ్ లు అవసరమవుతాయి. ఒకే ఒక్క బిడ్ స్వీకరిచబడదు.
4. వేలం నోటిఫికేషన్ లో పేర్కొన్న వాణిజ్య షాపులు వేలం తేదీ నాటికి యదాతథంగా ఉన్న స్థితిలో విక్రయానికి అందజేయబడతాయి.
5. అత్యధిక బిడ్ ను 3 సార్లు ప్రకటించిన తర్వాత మాత్రమే వేలం ఖాయమైనట్టు అంతిమంగా ప్రకటించబడుతుంది. బిడ్ కు నిర్దిష్ట సమయ పరిమితి ఉండదు. స్వేచ్ఛగా, పారదర్శకంగా వేలం నిర్వహించబడుతుంది.
6. అత్యధిక వేలం పొందిన బిడ్డర్ రెవెన్యూ అధికారి నుంచి ఇంటిమేషన్ లెటర్ అందిన 30 రోజుల లోపు మొత్తం బిడ్ మొత్తాన్ని చెల్లించాలి. చెల్లించడంలో విఫలం అయితే ఈ.ఎం.డి విడుదల చేయబడదు అని కలెక్టర్ వివరాలు విడుదల చేశారు.



## డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**దేవరుప్పుల నేడు న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా దేవరుప్పుల మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తహశీల్దార్ అశ్వక్ అహ్మద్. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు,ఝాంశీ మనోజ్,జూనియర్ అసిస్టెంట్స్ నరేందర్,శారద,+జూశీలు కృష్ణ, శ్రీధర్, రాములు, వెంకటేష్,యాకయ్య, రాజా,రమేష్, రాఘవరెడ్డి, అజీముద్దిన్, జయశ్రీ,భాగ్యలక్ష్మి, అనూష, రికార్డు అసిస్టెంట్ మంజుల, రాజు,అటెండర్లు యాకయ్య, అక్బర్,రేణుక, చంద్రయ్య, పాల్గొన్నారు.



## అంబేద్కర్ జయంతి వేడుకలు

**జవహర్ నగర్, నేడు న్యూస్ :** జవహర్ నగర్ లో మంగళ వారం డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జవహర్ నగర్ చౌరస్తాలోమహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షతన నిర్వహించగా చంద్రపూర్ కాలనీ, జవహర్ నగర్ డివిజన్లలో స్థానిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలలో జవహర్ నగర్ సిఐ సైదులు, మాజీ మేయర్లు మేకల కావ్య, దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల ముదిరాజ్, బిజెపి అధ్యక్షులు కమలాకర్, జోగారావు, మాజీ కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ వార్డ్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పార్టీల జిల్లా, స్థానిక నాయకులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కు అనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. భారత రాజ్యాంగం వర్ధిల్లాలి, మహనీయుల ఆశలను కొనసాగించాలని, రాజ్యాంగఫలాలు ప్రజలందరికీ సమానంగా అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## యువ భారత నిర్మాణానికి అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకం : ఆదేర్ల వినయ్ కుమార్



**కారేపల్లి. నేడు న్యూస్:** మెరుగైన విద్య, విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగ రహిత యువ భారతాన్ని నిర్మించడమే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు, సింగరేణి మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ కార్యకర్తలు గాదె నరేష్, కాకాటి పృధ్వి, ఉప్పెల్లి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లంపేట పురపాలక సంఘం

# 'ప్లాన్' ప్రకారం దోపిడీ జరుగుతోందా ?

- క్షేత్రస్థాయిలో విస్మయం కలిగిస్తున్న అక్రమ నిర్మాణాలు!
- అక్రమ నిర్మాణాలకు టీపీఓ అండదండలు ఉన్నాయా?
- ప్రశ్నిస్తే 'లెటర్' డ్రామా.. బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట !
- ఉన్నతాధికారులు మేల్కొనేది ఎప్పుడు ?
- విచారణ కోరుతున్న స్థానికులు



ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో నిర్మిస్తున్న నిర్మాణం



ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న అరుణ గోడౌన్




**మేడ్చల్, నేడు న్యూస్ :** అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఎల్లంపేట పురపాలక సంఘం మారుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి, అనుమతులు లేకుండానే భారీ భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగం అండదండలతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇంచార్జ్ టీపీఓ సుకన్య తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

**ప్రభుత్వ ఖజానాకు కన్నం.. అధికారుల జేబులు నిండుతున్నాయా ?**

పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయాన్ని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఒక్కో భవనం నుండి రావాల్సిన లక్షలాది రూపాయల ఫీజులను ఎగవేస్తూ, అధికారుల సహకారంతో నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా, టీపీఓ సుకన్య కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున 'ముడుపులు' ముట్టాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారిణి, వాటికి రక్షణ కవచంలా మారడం పురపాలక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**ప్రశ్నిస్తే 'లెటర్' డ్రామా.. బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట !**

క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతిని ఎండగట్టేందుకు వెళ్లిన పాత్రికేయుల పట్ల టీపీఓ సుకన్య వ్యవహరిస్తున్న తీరు గర్హనీయం. ప్రజాప్రయోజనాల దృష్ట్యా వివరణ కోరితే.. సమాధానం చెప్పలేక, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి లిఖితపూర్వకంగా రాసి ఇవ్వండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, అక్రమాలను ప్రశ్నించిన వారిపైనే ఆగ్రహం వ్యక్తం చేయడం ఆమె విధి నిర్వహణలో వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.

**ఉన్నతాధికారులు మేల్కొనేది ఎప్పుడు ? :**

ఎల్లంపేట పురపాలక సంఘంలో అక్రమ నిర్మాణాల జోరు చూస్తుంటే, అసలు ఇక్కడ పురపాలక చట్టం అమలవుతుందా లేదా అన్న సందేహం కలుగుతోంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న ఈ భారీ కుంభకోణంపై జిల్లా కలెక్టర్, పురపాలక కమిషనర్ తక్షణమే స్పందించి టీపీఓ సుకన్యపై శాఖాపరమైన విచారణ జరిపి, తక్షణమే ఆమెను విధుల నుంచి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

### అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి

## నివాళులర్పించిన ఝాన్సీరెడ్డి



**దేవరుప్పుల నేడు న్యూస్ :** దేవరుప్పుల మండలకేంద్రంలోని ప్రధాన చౌరస్తా ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి పాల్గొని అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ గారు దేశానికి సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను అందించిన మహనీయుడని,అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి ప్రేరణగా నిలుస్తుందని,అలాగే అంబేద్కర్ గారి ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, ముఖ్యంగా యువత విద్య, చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ,ఎస్టీ,ఎస్సి, బిసి,మైనారిటీ సెల్ అధ్యక్షులు భూక్యా సజ్జన్, ఇనుముల నాగరాజు,కాడబోయిన గణేష్, మహ్మద్ రసూల్,యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, మండల అధ్యక్షుడు కొంగరి ఉమేష్,స్థానిక ప్రజాప్రతినిధులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు,అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

### ఆర్థిక, సామాజిక అసమానతలు రాజ్యాంగ

## ఆదర్శాలకు సవాలుగా నిలుస్తున్నాయి

**భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్**



**మేడ్చల్ నేడు బ్యూరో:** రాజ్యాంగం సమానత్వాన్ని కేవలం ఒక లాంఛనప్రాయ హామీగా కాకుండా, పాతుకుపోయిన అధిశ్వ వ్యవస్థలను నిర్మూలించడానికి ఒక సార్వత్రిక నిబద్ధతగా నిలుస్తుందని భారత మాజీ ప్రధాన న్యాయ మూర్తి బి.ఆర్.గవాయ్ అన్నారు. మంగళవారం శామీర్ పేట లోని నల్సార్ యూనివర్సిటీలో రాజ్యాంగ చట్టం – సామాజిక నిర్మాణం పరివర్తన అనే అంశంపై డాక్టర్: బి.ఆర్. అంబేద్కర్ పీఠం డిబేట్ ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ "సుస్థిర అభివృద్ధి సార్వత్రిక సమానత్వం: ఒక రాజ్యాంగ సంభాషణ" అనే శీర్షికతో జస్టిస్ గవాయ్ ప్రారంభోపన్యాసం ఇస్తూ, రాజ్యాంగ చట్రంలో అభివృద్ధి, సమానత్వం మధ్య ఉన్న సంబంధంపై లోతైన విశ్లేషణను అందించారు. ఆయన ఒక ప్రాథమిక ప్రశ్నను లేవనేత్తుతూ సార్వత్రిక సమానత్వాన్ని పొందుపరచకపోతే అభివృద్ధి సుస్థిరంగా ఉంటుందా అని ప్రశ్నించారు. అలాగే, భౌతిక, నిర్మాణాత్మక అసమానతలను పరిష్కరించకుండా సమానత్వ వాగ్దానాన్ని నెరవేర్చగలమా అని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ దృక్పథాన్ని స్ఫూర్తిగా తీసుకుని, జస్టిస్ గవాయి మాట్లాడుతూ, "వైరుధ్యాల జీవితం" గురించి డాక్టర్: అంబేద్కర్ చేసిన హెచ్చరికను ప్రస్తావిస్తూ, సామాజిక , ఆర్థిక అసమానతల కొనసాగింపు రాజ్యాంగ ఆదర్శాల సాకారానికి సవాలుగా నిలుస్తూనే ఉన్నాయన్నారు. నిర్మాణాత్మక అసమానతలు, వనరులు, అవకాశాల లభ్యతను ఎలా ప్రభావితం చేస్తాయో, అలాగే పర్యావరణ, అభివృద్ధి సవాళు అణగారిన వర్గాలపై అసమా నంగా ఎలా ప్రభావం చూపుతాయో జస్టిస్ గవాయి వివరిం చారు. కరువు, వ్యవసాయ సంక్షోభం, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వంటి ఉదాహరణల ద్వారా, దుర్బలత్వం అనేది యాదృచ్ఛికం కాదని, అది సామాజికంగా సృష్టించబడుతుం దని ఆయన నొక్కిచెప్పారు. సుస్థిర అభివృద్ధిని సామాజిక న్యాయాన్ని సమగ్రపరిచే ఒక రాజ్యాంగ సూత్రంగా అర్థం చేసుకోవాలన్నారు. అసమానతలను శాశ్వతం చేసే అభివృద్ధిని సుస్థిరమైనదిగా పరిగణించలేమ న్నారు. దానికి బదులుగా దుర్బలత్వాన్ని తగ్గించాలనీ, లభ్యతను పునఃపంపిణీ చేయాలనీ, అత్యంత ప్రమాదంలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలనీ, దీనికి, కేవలం లాంఛనప్రాయంగా తటస్థంగా ఉండే విధానాలను దాటి, అసమాన ప్రారంభ స్థానాలను గుర్తించే చట్రాల వైపు పయనించడం అవసరమన్నారు.

ఈ దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగ న్యాయ శాస్త్రం పాత్రను కూడా జస్టిస్ గవాయి నొక్కిచెప్పారు. ఆర్టికల్ 21 కింద జీవించే హక్కులో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి సూత్రాలు పొందుపరచబడ్డాయని ఆయన పేర్కొన్నారు. పర్యావరణపరంగా, సామాజికంగా న్యాయమైన అభివృద్ధిని నిర్ధారించడంలో ప్రభుత్వ, కార్పొరేట్ బాధ్యతలకు పెరుగుతున్న గుర్తింపును ఆయన ఈ సందర్భంగా ప్రధానంగా ప్రస్తావించారు. రాజ్యాంగ ఆదర్శాలను ఆచరణలోకి తీసుకురావడంలో సంస్థలు, ముఖ్యంగా విశ్వవిద్యాలయాల పాత్రపై ఆయన తన ఉపన్యాసంలో ప్రస్తావించారు. విశ్వవిద్యాలయాలు తమ పరిపాలనా నిర్మాణాలలో సార్వత్రిక సమానత్వాన్ని పొందుపరచడం ద్వారా రాజ్యాంగ పరిపాలనకు ప్రయోగశాలలుగా పనిచేయగలవని జస్టిస్ గవాయి అన్నారు. ఒప్పంద, రోజువారీ కూలీల పని పరిస్థితులను, సంక్షేమాన్ని మెరుగుపరచడానికి, ప్రాథమిక సౌకర్యాల లభ్యతను నిర్ధారించడానికి, మరింత సమ్మిళిత సంస్థాగత వ్యవస్థలను సృష్టించడానికి చర్యలు అవసరమన్నారు. సమాజంలోని పేద వర్గాలను వెనుకబడేలా చేసే అభివృద్ధి నమూనా నిలకడగా ఉండదని జస్టిస్ గవాయి పునరుద్ఘాటించారు. చారిత్రక ప్రతికూలతలను పునరుత్పత్తి చేసే బదులు, వాటిని సరిదిద్దే విధంగా పరిపాలనను పునఃసమీక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నల్సార్ వైస్-ఛాన్సలర్, ప్రొఫెసర్: శ్రీకృష్ణ దేవారావు,రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎన్. వసంతి వందన, ఇతర విశ్వవిద్యాలయాల వైస్-ఛాన్సలర్లతో పాటు, అధ్యాపక సభ్యులు, విద్యార్థులు, పరిశోధకులు, విద్యావేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అర్ధరాత్రి అప్రమత్తతతో మంటలు అదుపు

**కారేపల్లి. నేడు న్యూస్:** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నడిమూరు గ్రామ శివారులో అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగి గ్రామ ప్రజల్లో ఆందోళన నెలకొంది. గ్రామానికి సమీపంలోనే మంటలు వ్యాపించడంతో ప్రమాద సూచనలు కనిపించాయి. ఈ విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి--రాజు అప్రమత్తమై, పంచాయతీ సిబ్బందిని వెంట తీసుకుని ఘటన స్థలానికి చేరుకున్నారు. సమన్వయంతో చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తెచ్చి, పెద్ద ప్రమాదం సంభవించకుండా నివారించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఏప్రిల్ నెలలో ఎండలు తీవ్రంగా ఉండటంతో ఇలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో గడ్డివాములు, పూరి గుడిసెలు, ఇంటి ప్రహరీ కంచలు ఉండటం వల్ల మంటలు వ్యాపించే ప్రమాదం అధికంగా ఉంటుందని, ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో ప్రజలు నిద్రలో ఉండటంతో నష్టం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. సమాచారం అందుకున్న వెంటనే చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదం తప్పిందని వివరించారు. సమయానికి స్పందించి గ్రామాన్ని ప్రమాదం నుంచి కాపాడిన సర్పంచ్ వరలక్ష్మి--రాజు, పంచాయతీ సిబ్బందిని నడిమూరు గ్రామస్తులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



## బింగి శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు

**ఉప్పల్, నేడు న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం, మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు ఉప్పల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సమస్యలు, స్థానిక ప్రజల మౌలిక సదుపాయాల లోపాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేసినందుకు బింగి శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డును మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేంద్ర రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ అందజేశారు. ప్రజల సమస్యలు, ముఖ్యంగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసినందుకు ఈ గౌరవం దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారులు, దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ జయంతి వేడుకలు


**దేవరుప్పుల నేడు న్యూస్ :** భారత రత్న డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా దేవరుప్పుల మండలకేంద్రంలోని ప్రధాన చౌరస్తా ప్రాంగణంలో డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాం రెడ్డీ. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్, దేవరుప్పుల ఉప్ప సర్పంచ్ నర్ర కోమలత సోమశేఖర్ ,చింత రవి,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేషం, మాజీ ఎం పి టి సి క్రిష్టయ్య,యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్,బిఆర్ఎస్ నాయకులు ఏల సుందర్,జోగు సోమనర్సయ్య,హనుమంతు, మల్లారెడ్డి,తాటిపెల్లి మహేష్,సాయిలు,పర్శరాములు, సమ్రాట్,మహేశ్,చింటూ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యలో జోక్యం చేసుకోవద్దు

## అమెరికాకు చైనా వార్నింగ్



**చైనా :** అమెరికాకు చైనా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్‌తో తమకున్న ద్వైపాక్షిక సంబంధాల విషయంలో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించింది. ఇదే క్రమంలో హర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్ ఈ మేరకు హెచ్చరికలు చేశారు. ప్రపంచంలో శాంతి, స్థిరత్వానికి బీజింగ్ కట్టుబడి ఉందని డాంగ్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామన్నారు. హర్మూజ్ జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌తో కుదుర్చుకున్న వాణిజ్య, ఇంధన ఒప్పందాలను బీజింగ్ గౌరవిస్తుందన్నారు. ఈ వ్యవహారాల్లో ఇతరులు (అమెరికాను ఉద్దేశిస్తూ) జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని గట్టిగా హెచ్చరించారు. జలసంధి ఇరాన్ నియంత్రణలోనే ఉందని.. చైనా నౌకలకు అది తెరిచే ఉంటుందని స్పష్టం చేశారు. ఇక, యుద్ధం ముగించే విషయంలో చైనా విదేశాంగశాఖ తన మద్దతును పునరుద్ఘాటించింది. హర్మూజ్ భద్రతపై ఆందోళన లేవనెత్తింది. ఈ జలసంధి మీదుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా నౌకల రవాణా కొనసాగాలని పిలుపునిచ్చింది.




# డీల్‌పోయే.. ఖర్చు మిగిలే

## హోటల్ బిల్లు కట్టలేక పాక్ అవస్థలు

**ఇస్లామాబాద్ :** అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచింది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోన్న ఆ దేశం.. చర్చల ఫలితంతో సంబంధం లేకుండా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీనికి సంబంధించిన మీడియా కథనాల ప్రకారం.. పశ్చిమాసియా ఘర్షణలకు ముగింపు పలికి అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చుకోవాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చింది. అందుకు ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్ వేదికైంది. అటు యూఎస్.. ఇటు ఇరాన్ నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు వచ్చారు. చర్చల్లో ఎలాంటి ఫలితం రాలేదు కానీ.. హోటల్ బిల్లులు మాత్రం మోగిపోయాయని నిఘా వర్గాలను పేర్కొంటూ కథనాలు వచ్చాయి. ఆ బిల్లుల్ని పాక్ ప్రభుత్వం చెల్లించలేదట. సమస్యను పరిష్కరించేందుకు హోటల్ యజమాని రంగంలోకి దిగాల్సి వచ్చిందని రాసుకొచ్చాయి. రెండు దేశాలకు ఆతిథ్యం ఇచ్చినప్పుడు వచ్చే రొటీన్ ఖర్చులు కూడా చెల్లించడంలో పాక్ విఫలమైందని పేర్కొన్నాయి. పాక్ దౌత్య ఆశయాలకు, అంతర్గతంగా నెలకొన్న ఆర్థిక అస్థిరతలకు మధ్య ఎంతో దూరముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక సమస్యల నుంచి తాత్కాలికంగా గట్టెక్కేందుకు అంతర్జాతీయ ద్రవ్యనిధి ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మరోవైపు ద్రవ్యోల్బణం ఏడు నుంచి తొమ్మిది శాతం మధ్య ఉంది. ఈ సమస్యల మధ్య మరోదఫా యూఎస్-ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. ఏప్రిల్ 21తో రెండువారాల కాల్పుల విరమణ ముగియనుంది. ఈ లోపే ఆ చర్చలు ఉండొచ్చని తెలుస్తోంది.



# పశ్చిమాసియా సంక్షోభం..

## భారత్‌లో లక్షల మంది పేదరికంలోకి..

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో.. ఇప్పటికే చమురు ధరలు మండిపోతున్నాయి. పలు దేశాల్లో నిత్యావసర సరకుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సంక్షోభం భారత్‌పైనా తీవ్ర ప్రభావం చూపనుందని తాజాగా ఐక్యరాజ్యసమితి పేర్కొంది. యుద్ధం కారణంగా దేశంలోని 25 లక్షల మంది ప్రజలు పేదరికంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని పేర్కొంది. 'పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు.. ఆసియా, పసిఫిక్‌లో మానవ అభివృద్ధిపై ప్రభావాలు' అనే పేరుతో యూఎన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఓ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం.. ఈ యుద్ధం ఆసియా, పసఫిక్ అంతటా అభివృద్ధిని తగ్గిస్తుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 88 లక్షల మంది ప్రజలు పేదరికంలో కూరుకుపోయే ప్రమాదం ఉందని అంచనా వేసింది. చైనాలో కూడా దీని ప్రభావం అధికంగానే ఉండవచ్చని పేర్కొంది. ఇక, పెరిగిన ఇంధన ధరలు, రవాణా, ముడిసరకుల ఖర్చులు కుటుంబాల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తాయని తెలిపింది. ఆహార సంబంధిత సమస్యలు పెరుగుతాయని, ప్రభుత్వ బడ్జెట్లపై భారం పడుతుందని, జీవనోపాధిని బలహీనపరుస్తుందని వెల్లడించింది. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, ఫిలిప్పీన్స్‌తో సహా అనేక దేశాల్లో ఆహార భద్రత ఒత్తిళ్లు తీవ్రమవుతాయని పేర్కొంది. ఈ సంఘర్షణ సుదీర్ఘకాలం కొనసాగితే భారత్‌లో యూరియా నిల్వలు తగ్గిపోయి.. రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వెల్లడించింది. హర్మూజ్ జలసంధి పరిసరాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా.. భారత్‌లో వైద్య పరికరాలకు సంబంధించిన ముడిపదార్థాల ధరలు సుమారు 50 శాతం పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఔషధాల టోకు ధరలు ఇప్పటికే 10-15 శాతం పెరిగాయని వెల్లడించింది.

# ఆందోళనల వేళ..

## యూపీ ప్రభుత్వం కీలక నిర్ణయం



**యూపీ :** ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కార్మికుల కనీస వేతనాలను రూ. 3వేలు వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కనీస వేతనం పెంచాలంటూ నోయిడా, గజియాబాద్‌లోని కార్మికులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. నోయిడా, గజియాబాద్‌లలోని నైపుణ్యం లేని కార్మికుల నెలవారీ వేతనాలు రూ. 11,313 నుంచి రూ. 13,690కి పెంచింది. ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఇతర రంగాల కార్మికులకు కూడా వేతనాలు పెంచుతున్నట్లు పేర్కొంది. అయితే, మున్సిపల్ కార్పొరేషన్లు, జిల్లాల్లో ఈ వేతన పెంపు వేరువేరుగా ఉంటుందని స్పష్టంచేసింది. ఇది తాత్కాలిక నిర్ణయం మాత్రమేనని.. వేతన మండలి సమగ్ర సమీక్ష తర్వాత దీనిపై పూర్తి నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. నోయిడాలో మంగళవారం కూడా ఆందోళనలు చెలరేగాయి. తక్కువ వేతనాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న కార్మికులు, పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. వేతనాలు పెంచాలంటూ సోమవారం నోయిడాలో వేల మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. కొంతసేపటికే అవి హింసాత్మకంగా మారాయి. పోలీసుల పైకి రాళ్లు రువ్వడంతో సహా కార్లు తగలబెట్టడం, రహదారులను దిగ్బంధించడం వంటివి చోటుచేసుకున్నాయి. పరిశ్రమలోని సీసీటీవీ దృశ్యాల ఆధారంగా హింసాత్మక ఘటనలకు పాల్పడిన 300 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. ఇక్కడ ఇటీవల పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో కొందరు వ్యక్తుల అరెస్టులు జరిగాయి. ఈ క్రమంలో తాజా ఘర్షణల్లో పాక్ ప్రమేయం ఉందేమోనన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఉత్తరప్రదేశ్ కార్మికశాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ పేర్కొన్నారు.

# రానున్న రోజుల్లో ఇంకా చూస్తారు

## అమెరికా మంత్రి క్రిస్‌రైట్ హెచ్చరిక




**వాషింగ్టన్ :** పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది. దాంతో రానున్న వారాల్లో చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ హెచ్చరించారు. హర్మూజ్‌లో నౌకల రాకపోకలు మొదలైనా.. రవాణా మునుపటి స్థాయికి చేరేవరకు ఈ మోత ఉంటుందని హెచ్చరించారు. వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "హర్మూజ్ లో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో పెరిగే వరకు ఇంధన ధరల అధికంగా ఉండొచ్చు. పెరుగుతూనే ఉండొచ్చు కూడా" అని వ్యాఖ్యానించారు. చమురు ధరలు తగ్గొచ్చని కొద్దిరోజుల క్రితం ఆయనే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇక నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల వరకు ఇంధన ధరలు ఎక్కువగానే ఉండొచ్చని ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సూచనప్రాయంగా వెల్లడించారు.

### భారీగా తగ్గిన చమురు ఉత్పత్తి..

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మార్చి నెలలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తి భారీగా తగ్గిందని ఒపెక్ విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడవుతోంది. ఇరాక్‌లో దాదాపు 61శాతం మేర ఉత్పత్తి తగ్గింది. ఫిబ్రవరిలో రోజుకు 4.2 మిలియన్ బ్యారెళ్ల నుంచి మార్చిలో రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. కువైట్‌లో 53శాతం, యూఏఈలో 44 శాతం, సౌదీ అరేబియా 23 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. ఇక చమురు సరఫరాలో కీలకమైన పైప్‌లైన్ ఇరాన్ దాడుల్లో దెబ్బతినడంతో రోజూవారీ 7 మిలియన్ల బ్యారెళ్ల నుంచి 7 లక్షల బ్యారెళ్లకు పడిపోయిందని సౌదీ మీడియా వెల్లడించింది. మొత్తంగా ఒపెక్ దేశాలు చేసే ఉత్పత్తి 27 శాతం మేర కుంగింది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. అందుకు తగ్గట్టే ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోకుండా.. అమెరికా ఆంక్షలున్న చైనా ట్యాంకర్ హర్మూజ్‌ను దాటింది. మరిప్పుడు దీనిపై యూఎస్ నౌకాదళం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది.

# ఇజ్రాయెల్‌తో చర్చలు వద్దు

## లెబనాన్‌కు హెజ్‌బొల్లా సూచన



**వాషింగ్టన్ :** వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్‌తో నేడు జరగనున్న భేటీని రద్దు చేసుకోవాలని హెజ్‌బొల్లా లెబనాన్‌కు సూచించింది. చిరకాల ప్రత్యర్థితో ప్రత్యక్ష చర్చలు జరపడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. వేలమంది దేశ ప్రజల మరణానికి కారణమైన ఆ దేశంతో ఒప్పందం చేసుకోవడం సరైన చర్య కాదంది. నేడు వాషింగ్టన్‌లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నేతృత్వంలో లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య ప్రత్యక్ష చర్చలు జరగనున్న నేపథ్యంలో హెజ్‌బొల్లా ఈ మేరకు సూచనలు చేసింది. కాగా చర్చల్లో ముందుకువెళ్లాలంటే మొదట కాల్పుల విరమణ జరగాలని బీరుట్ పట్టుబట్టగా.. ముందు చర్చలు జరిగిన తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకోనున్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.

### కొనసాగుతోన్న దాడులు..

ఓవైపు ఇరుదేశాలు చర్చలకు సిద్ధమవుతుండగా.. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. భూతల దాడులు సహా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. బీరుట్, బింట్ జెబీల్, అల్ తైరి ప్రాంతాల్లోని హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. హెజ్‌బొల్లా సైతం ఇజ్రాయెల్ సైన్యంపై ప్రతిదాడులకు దిగింది. ఆ దేశ రక్షణ దళ వాహనాలను పేల్చినట్లు వెల్లడించింది. కాగా ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 2,055 మంది మృతి చెందారని లెబనాన్ ఆరోగ్యశాఖ పేర్కొంది.

# నోయిడా అల్లర్ల వెనుక పాక్ హస్తం

**అల్లర్లకు పాల్పడ్డ 300 మంది కార్మికుల అరెస్టు**

**యూపి కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ వెల్లడి**

**లక్నో, ఏప్రిల్ 14 :** నోయిడాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడిన 300 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. మరో 100 మందిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. వేతనాల పెంపు, 8 గంటల పని కోసం సోమవారం కార్మికులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. నోయిడాలోని ఫేజ్-2, సెక్టార్ 60, సెక్టార్ 62, సెక్టార్ 84 సహా పలు ప్రాంతాల్లో కార్మికులు ఆందోళనకు దిగారు. పలు వాహనాలను తగులపెట్టి.. భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వారు. జాతీయ రహదారి -9 సహా పలు రోడ్లను దిగ్బంధించారు. దీంతో నోయిడా- ఢిల్లీ సరిహద్దుల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తెంది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువులు సైతం ప్రయోగించారు. అయితే, కార్మికుల హింసాత్మక ఘటనలపై ఉత్తర ప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి అనిల్ రాజ్‌భర్ స్పందించారు. దాడిని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హింసగా అభివర్ణించారు. పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై ఇటీవల నోయిడా, మీరట్‌లలో నలుగురు అనుమానితులు అరెస్టయిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. నిన్నటి దాడికి పాకిస్థాన్‌తో సంబంధం ఉందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆ కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. అస్థిరతను సృష్టించే ఉద్దేశంతోనే ఈ ఘటన జరిగి ఉండొచ్చని ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి రాజ్‌భర్ చెప్పారు. రాష్ట్రంలో అస్థిరతను సృష్టించేందుకు దేశ వ్యతిరేక శక్తులు ప్రయత్నిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. ముజఫర్‌నగర్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కార్యక్రమానికి అంతరాయం కలిగించే కుట్రలో భాగంగానే ఈ అల్లర్లు జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. కార్మికులు ప్రశాంతంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు, తప్పుడు సమాచారానికి ప్రభావితం కాకూడదని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలు వినేందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు నోయిడాకు చేరుకుని కార్మికులతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి రాజ్ భర్ తెలిపారు.

# 'డీలిమిటేషన్'పై తమిళనాడు సీఎం స్టాలిన్ వార్నింగ్



**తమిళనాడు :** తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎక్స్ వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ గురించి ఆ వీడియోలో మాట్లాడారు. ప్రస్తుతం ఈ అంశం తమిళ నాట రాజకీయ పార్టీల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. "ఏప్రిల్ 16న కేంద్రప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులో ఎన్నికలకు ముందు సమావేశం ఉండటం గమనార్హం. నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్విభజనను ముందు నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నాం. ఈ పునర్విభజన కారణంగా ప్రభావితమయ్యే రాష్ట్రాల ముఖ్యమంత్రులను, అలాగే ప్రధాన రాజకీయ పార్టీలను ఒకచోట చేర్చి, చెన్నైలో సంయుక్త కార్యాచరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించాం" అని స్టాలిన్ పేర్కొన్నారు. "దక్షిణాది రాష్ట్రాలపై ఈ పునర్విభజన ప్రక్రియ ప్రభావం ఉండదని ప్రధాని పార్లమెంటులో హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాం. ఇంతవరకు దీనిపై స్పందించలేదు. ఈ అంశంపై చర్చించేందుకు ప్రధానితో అపాయింట్‌మెంట్ కోరాం.. కానీ వారు పట్టించుకోలేదు. డీలిమిటేషన్‌పై ఏకపక్షంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. మేం ఊరుకునేది లేదు. తమిళనాడు ప్రేక్షకపాత్ర పోషించదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తుంది. ఇది బెదిరింపు కాదు.. ఫైనల్ వార్నింగ్. ఈ పోరాటంలో తమిళనాడు ప్రజలు గెలుస్తారు" అని స్టాలిన్ వీడియో విడుదల చేశారు.




# అమెరికా- ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వానికి సిద్ధం : రష్యా

**రష్యా :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న నేపథ్యంలో.. అమెరికా-ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వానికి రష్యా ముందుకొచ్చింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరగకుండా నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని లావ్రోవ్ పిలుపునిచ్చారు. ఈమేరకు రష్యా విదేశాంగశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. సాయుధ ఘర్షణలు పునరావృతం కాకుండా చూసుకోవాలని లావ్రోవ్ పిలుపునిచ్చారు. సంక్షోభాన్ని పరిష్కరించడంలో చేతనైనంత సాయం చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు. ఇరాన్, దాని పొరుగుదేశాల చట్టబద్ధమైన ప్రయోజనాలను గౌరవిస్తామన్నారు. ఈ సంఘర్షణను ముగించేందుకు, పశ్చిమాసియాలో దీర్ఘకాల శాంతి కోసం చేస్తున్న దౌత్య ప్రయత్నాలను మాస్కో స్వాగతిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఇస్లామాబాద్‌లో ఇటీవల అమెరికాతో జరిగిన శాంతి చర్చలకు సంబంధించిన వివరాలను అరాగ్చీ లావ్రోవ్‌కు వివరించారని రష్యా విదేశాంగశాఖ తెలిపింది.

### యురేనియంను స్వీకరించేందుకు సిద్ధం..: రష్యా

అణ్వస్త్రాన్ని వీడేందుకు ఇరాన్ నిరాకరించడంతో అమెరికాతో జరిగిన శాంతిచర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా పునరుద్ఘాటించింది. అమెరికాతో భవిష్యత్తులో కుదిరే శాంతిఒప్పందంలో భాగంగా ఈ చర్యకు సిద్ధమైనట్లు క్రెమ్లిన్ పేర్కొంది. 'అమెరికా, ప్రాంతీయ నాయకులతో జరిపిన చర్చల్లో అధ్యక్షుడు పుతిన్ ఈ ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన ఇప్పటికీ అలాగే ఉంది. కానీ, దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు' అని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామంటూ ట్రంప్ బెదిరింపులకు పాల్పడటాన్ని తప్పుబట్టారు.



# పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

## చైనా నాలుగు పాయింట్ల ప్రతిపాదన

**చైనా :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతుండడంపై చైనా ఆందోళన వ్యక్తంచేసింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజాగా బీజింగ్‌లో అబుదాబి క్రౌన్‌ప్రిన్స్ మహమ్మద్ బిన్ జాయేద్‌తో సమావేశమయ్యారు. ఈక్రమంలోనే గల్ఫ్ దేశాల్లో శాంతి, స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించాలని పేర్కొన్నారు. ఈ మేరకు జిన్‌పింగ్ నాలుగు అంశాలతో శాంతి ప్రతిపాదనను క్రౌన్‌ప్రిన్స్ ముందుంచినట్లు చైనా ప్రభుత్వ రంగ మీడియా కథనం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలో శాంతియుత సహజీవనం, జాతీయ సార్వభౌమాధికారం, చట్టబద్ధమైన అంతర్జాతీయ పాలన, అభివృద్ధి, ప్రపంచ భద్రత వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ రెండ్రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మంగళవారం చైనా (జప్త్రఅఖ)కు చేరుకున్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో కీలకమైన అంతర్జాతీయ విషయాలతో పాటు.. ద్వైపాక్షిక అంశాలపైనా చర్చలు జరపనున్నట్లు రష్యా విదేశాంగ శాఖ వెల్లడించింది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com